

నిష్పక్షపాతం.. సత్యనిష్ట..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విశాఖపట్నం సంపుటి : 60 సంచిక : 335 • పేజీలు : 8 • మంగళవారం 27 ఆగస్టు 2024 • వెల : రూ. 5.00
Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati

## యూపిఐ తరహాలో యూఎల్ఐ సేవలు

- డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జర్నీలో యూఎల్ఐ కీలక భూమిక
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వెల్లడి



బెంగళూరు,ఆగస్టు 26 : యూపీఐ సేవల ద్వారా డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టిన మిగతా 7లో

## లద్దాఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాలు

- సుసంపన్నమైన లద్దాఖ్ నిర్మాణమే లక్ష్యం
- ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ,ఆగస్టు 26 : కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌కు సంబంధించి ప్రధాని మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ మిగతా 7లో

## పాకిస్థాన్‌లో దారుణం



- పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల కిరాతకం
- ప్రయాణికులపై దుండగుల కాల్పులు
- 23 మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు

7లో

## బిజెపి అభ్యర్థుల తొలి జాబితా

# విడుదల

◆ కశ్మీర్ స్టార్ క్యాంపెయినర్ ప్రధాని మోదీ
◆ మొత్తం 40 మందితో ప్రచార సారథుల జాబితా
◆ జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు విడతలుగా పోలింగ్
◆ సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న పోలింగ్
◆ జమ్మూకశ్మీర్‌లో తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవే కావడం విశేషం



న్యూఢిల్లీ,ఆగస్టు 26 : జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే 15 మంది అభ్యర్థుల తొలి జాబితాను సోమవారం నాడు విడుదల చేసిన బీజేపీ తొలి విడత ప్రచారంలో పాల్గొనే 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను కూడా విడుదల చేసింది. ఆ ప్రకారం జమ్మూకశ్మీర్ లీడ్ క్యాంపెయిర్‌గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉంటారు. కేంద్ర మంత్రులు మిగతా 7లో



# మాకు సాయం చేయండి

◆ 100 క్షిపణులు, డ్రోన్‌లతో రష్యా దాడి..
◆ రష్యా, ఉక్రెయిన్ మధ్య మళ్లీ మొదలైన బాంబు దాడులు
◆ ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది ఒకటి
◆ ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న అనేక భవనాలు
◆ కీలకమైన పౌర మౌలిక సదుపాయాలను టార్గెట్ చేస్తూ దాడులు
◆ దేశవ్యాప్తంగా రష్యా చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి..
◆ రష్యా వైమానిక బాంబు దాడులను అడ్డుకునేందుకు సాయం చేయండి
◆ తమ వైమానిక దళంతో పొరుగున ఉన్న యూరోపియన్ దేశా రక్షణ వ్యవస్థలు కలిసి పనిచేయాలి
◆ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

ఉక్రెయిన్,ఆగస్టు 26 : రష్యా, ఉక్రెయిన్ మధ్య మళ్లీ బాంబు దాడులు మొదలయ్యాయి. సోమవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో సహా పలు చోట్ల రష్యా క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది. పేలుళ్ల శబ్దాలు కీవ్‌లో చాలా గంటలపాటు ప్రతి ధ్వనిస్తూనే ఉన్నాయి. ఈ దాడుల కారణంగా అనేక భవనాలు దెబ్బతిన్నాయి. ఆస్తి, ప్రాణ నష్టం కూడా జరిగిందిసోమవారం రష్యా 100 క్షిపణులు, 100 డ్రోన్లతో తమ దేశంపై భీకర దాడికి పాల్పడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తోపాటు పొరుగున ఉన్న అనేక పశ్చిమ ప్రాంతాల్లో ఈ పేలుళ్లు మిగతా 7లో

## ప్రపంచంలో పెద్ద పార్టీగా

# బిజెపి..!



◆ పారదర్శకంగా పార్టీ సభ్యత్వ నమోదు
◆ బిజెపిని దెబ్బతీసేందుకు దుష్ప్రచారం..
◆ ఎలాంటి అవినీతి మరకలేకుండా ప్రజాహితంగా బిజెపి పని చేస్తోంది..
◆ రాజ్యాంగానికి కట్టుబడి పని చేసే పార్టీ బిజెపి
◆ బిజెపి అధ్యక్షురాలు పురందరేశ్వరి

రాజమండ్రి, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక): అత్యధికంగా సభ్యత్వం కలిగి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి ప్రజల్లో మన్ననలు పొందిం దని బీజేపీ అధ్యక్షురాలు,రాజమండ్రి మిగతా 7లో



## సెజ్ బాధితులను ఆదుకున్నాం

◆ మృతుల కుటుంబాలకు కోటి చొప్పున సాయం
◆ సినర్జిన్ కంపెనీ బాధితులకు పరిహారం ఇస్తున్నాం..
◆ హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి

విశాఖ,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక): అనకాపల్లి జిల్లా పరవాడలోని సినర్జిన్ కంపెనీ బాధితులకు పరిహారం ఇస్తున్నట్లు మిగతా 7లో

## ప్రజలకు అందుబాటులో

# ఇసుక వివరాలు



◆ రాష్ట్రంలో 62 స్టాక్‌యార్డుల ద్వారా వినియోగదారులకు ఇసుక సరఫరా
◆ జూలై నుండి సోమవారం వరకు 21,47,883 మెట్రిక్ టన్నుల ఇసుక కొనుగోలు
◆ గనులు, ఆబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడి

అమరావతి,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక): ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు రాష్ట్రంలో ఉన్న ఇసుక వివరాలను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించామని గనులు, ఆబ్కారీ శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో 62 మిగతా 7లో

## వైద్యురాలి హత్యాచారం



◆ పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు..
◆ తాను వెళ్లేసరికే మరణించిన స్థితిలో డాక్టర్
◆ నిందితుడు సంజయ్‌రాయ్ వెల్లడించినట్లు కథనాలు

7లో

## అనేక రికార్డులు తారుమారు

◆ సెప్టెంబర్ 1 నుంచి ఏపిలో రెవెన్యూ సదస్సులు
◆ గడిచిన ఐదేళ్లలో రెవెన్యూ పరంగా అనేక సమస్యలు
◆ బాధితుల నుంచి అధికారులు ఫిర్యాదులు తీసుకొని పరిష్కరిస్తాం..
◆ ఏపి మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి వెల్లడి



అమరావతి,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక): సెప్టెంబర్ 1 నుంచి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని ఏపీ మిగతా 7లో

## టీడీఆర్ బాండ్ల అక్రమాలు..



◆ సెప్టెంబర్ చివరి నాటికి టీడీఆర్ బాండ్ల అక్రమాలు తేలుస్తాం
◆ టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణకు కమిటీ వేశాం..
◆ జగన్ పాలనలో అవినీతిని కొత్తపుంతలు తొక్కించారు..
◆ మున్సిపల్ శాఖలోని సమస్యలను 6 నెలల్లో పరిష్కరిస్తాం..
◆ మాజీ సిఎం జగన్‌పై ఏపి మంత్రి నారాయణ మండిపాటు

తిరుపతి,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక): టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణకు కమిటీ వేశామని, సెప్టెంబర్ చివరి నాటికి టీడీఆర్ బాండ్ల అక్రమాలు తేలుస్తామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీఆర్ బాండ్లలో మిగతా 7లో

## ఏపిని గాడిలో పెడతాం



◆ ఏపికి 13లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి..!
◆ ఏ శాఖను రివ్యూ చేసిన ఎక్కడా అప్పులు తప్ప ఆదాయం నిల్..
◆ పార్టీలకు అతీతంగా పెంచిన పింఛన్లు అందించాం
◆ ఏపి మంత్రి అచ్చెం నాయుడు..

అమరావతి,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక): రాష్ట్రంలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఉన్నాయి. 13 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి మిగతా 7లో

## విద్యార్థుల వల్లనే తెలంగాణ

# పోరాటం..

◆ నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త
◆ త్వరలోనే మరో 35వేల ఉద్యోగాల భర్తీ
◆ త్వరలోనే యూనివర్సిటీల్లో విసిల నియామకం
◆ తెలంగాణ అభివృద్ధే మా లక్ష్యం అన్న సిఎం రేవంత్
◆ సివిల్స్ అభ్యర్థులకు లక్ష సాయం కింద చెక్కుల పంపిణీ



హైదరాబాద్,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక): నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఏర్పడ్డదే నిరుద్యోగుల సమస్యపై అని అన్నారు. విద్యార్థుల ఉద్యమం వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందని, మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# గాఢనిద్ర

"నిదురపోరా... తమ్ముడా.. నిదురలోన గతమునంతా నిముసమైనా మరచిపోరా..."ఇది ఎంతో ప్రఖ్యాతి చెందినగొప్ప పాట.'గానకోకిల'లతా మంగేష్కర్ తెలుగులో పాడిన మొట్టమొదటి గీతం.సుప్రసిద్ధ సంగీత దర్శకుడు సుసర్ల దక్షిణామూర్తి స్వయంగా రచించి,స్వరపరచిన చైతన్య ప్రబోధ 'గీతా'సుధ.ఈ పాట పుట్టి కూడా దాదాపు ఏడు దశాబ్దాలైంది (1955).ఈ పాట పుట్టిన సందర్భం,సన్నివేశం,చరణాలలోని భావాలు వేరే రసాన్ని పలికించినా నిదురపోరా తమ్ముడా.. అంటూ సందేశం ఇస్తోంది.మూగమనసులు సినిమాలో ఆత్రేయ ఓ పాట రాశాడు.అది అత్యంత ప్రముఖమైనది.పాడుతా తీయగా చల్లగా.. అని మొదలయ్యే ఈ గీతంలో "కునుకు పడితే మనసు కాస్త కుదుటపడుతది.. కుదుట పడ్డ మనసు తీపి కలలు కంటది.. "అని గొప్పగా అంటాడు.ఇలా 'నిద్ర'పై ఎన్నో గీతాలు,కవితలు,పద్యాలు వెల్లువలా వచ్చాయి.నిద్ర ఎంత ముఖ్యమో వైద్యులు, మానసిక శాస్త్రవేత్తలు పదే పదే చెబుతూనే ఉన్నారు.ఈరోజు పద్దెనిమిదేళ్ల ఓ కుర్రాడు కూడానిద్ర తనకు ఎంత ఉపయోగపడిందో చెప్పాడు.అతని పేరు ఆర్ కె శిశిర్. జెఈఈ అడ్వాన్స్ డ్ ఫలితాల్లో భారతదేశంలోనే టాపర్ గా నిలిచాడు.ఆదివారం నాడు ఫలితాలు విడుదలై,గొప్ప గెలుపును సొంతం చేసుకున్న సందర్భంలో ఈ కుర్రాడు చెప్పిన మాటలు ముత్యాల మూటలు.తను సాధించిన ఈ విజయంలో నిద్ర పాత్ర ఎంత గొప్పదో వివరించాడు.సమయపాలన, ప్రణాళిక,పట్టుదల,కృషితో పాటు చక్కని నిద్ర జతయైతే విజయలక్ష్మి వరిస్తుందని అతను చెప్పిన మాటలు నేటి తరం పిల్లలకు, పెద్దలకు కూడా గొప్ప పాఠాలు.సాధన చేసినంత కాలంరోజుకు 8గంటలు హాయిగా నిద్రపోయాడు.అది తన మెదడు, మనసును శక్తివంతంగా నిలబెట్టింది,నేడు అందరిలో అగ్రణిగా నిలబెట్టింది. మెదడుకు,మనసుకు నిద్ర గొప్ప శాంతిని కాంతిని ఇస్తాయని అతని మాటలు రుజువు చేస్తున్నాయి.గొప్ప కలలు కనండి... అవి తప్పక సాకారమవుతాయనిభారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్న మాటలు ఎంత సుప్రసిద్ధమో తెలిసిందే. ఆయన మంచి నిద్ర పోయాడు, మంచి కలలు కన్నాడు. గొప్ప గెలుపు,తృప్తితో జీవితకావ్యాన్ని కళామయం చేసుకున్నారు.నేటి జెఈఈ టాపర్ శిశిర్ కూడా బహుశా కలాం నుంచి స్ఫూర్తి పొంది ఉంటాడు.మంచి నిద్రపోవడం,గొప్ప కలలు కనడం గొప్ప కళ.దానిని అందంగా మలుచుకోవడంజీవన సౌభాగ్యానికి కీలకం. ఏ వయసు వారు ఎంత సేపునిద్ర పోవాలి? అనే చిట్టా కూడా ఉంటుంది.నిద్ర వల్ల మెదడుకు విశ్రాంతి దొరుకుతుంది,జ్ఞాపకశక్తి పెరుగుతుంది.రోగ నిరోధక శక్తి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుంది.కీలకమైననాడీవ్యవస్థ గొప్పగా పనిచేస్తుంది. హార్మోన్స్ ఉత్పత్తి,నియంత్రణనిద్ర వల్ల సక్రమంగా జరుగుతాయి.నిద్ర తగ్గితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు.నిద్ర మనిషి జీవితానికి,జీవనానికి శారీరకంగా,మానసికంగా అత్యంత ముఖ్యమైంది.నిద్ర పౌరులప్రాథమిక హక్కని సుప్రీం కోర్టు కూడా స్పష్టం చేసింది.పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో 2003 ప్రాంతంలో పరిశోధనలు జరిగాయి.8గంటల కంటే తక్కువ నిద్ర పోయిన వారిలో శారీరక సామర్థ్యం తగ్గిపోయినట్లు ఆ శాస్త్రవేత్తల మండలి గుర్తించింది. నిద్ర అంశంపై విస్తృతంగా ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి.ప్రతి సంవత్సరంమార్చి నెల మూడో శుక్రవారం నాడు 'ప్రపంచ నిద్రా దినోత్సవం' జరుపుకుంటున్నారు.నిద్ర సహజమైన దైనందిన చర్య . అంతే కాదు అది యోగవిద్యలో భాగం కూడా.మంచి నిద్రపట్టడం నిజంగా ఒక యోగం. "నిద్ర ఒక చిత్త వృత్తి "అని పతంజలి యోగ సూత్రాలు చెబుతున్నాయి.అదొక రకమైన యోగ సమాధిగా యోగా గురువులు చెబుతున్నారు.మహర్షి పతంజలి నుంచి నేటి విద్యార్థి శిశిర్ వరకూ చెబుతున్నదొక్కటే! మంచి ఆలోచనలతో ఉంటే అది దివ్య ఔషధం,భవ్య ఆయుధం. పగ,ప్రతీకారం,అహంకారం, అసూయ,అనుమానం వంటివి దరిచేరితే..." కంటికి నిద్ర వచ్చునే - సుఖంబగునే రతికేళి జిహ్వకున్ వంటకమించునే.. "అన్న శ్రీనాథుడి పద్య పాదాలు అక్షర సత్యాలవుతాయి. మానసిక,శారీరక ఆరోగ్యానికి నిద్ర ఎంత సమయం అవసరమో అంత వరకు పాటించడమే ఔచిత్యం.మొద్దునిద్ర వదలించుకొని యోగముద్ర వంటి గాఢనిద్రలోకి జారుకుందాం

# ఆడబిడ్డల్ని బతకనిద్ధాం

భారతీయ కుటుంభాల్లో బాలికల కంటె బాలురకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి రాజ్యమేలుతుంది. కుటుంభంలోనే బాలుర బాలికల మధ్య వివక్ష చోటుచేసుకుంది. బాలుర బాలికల మధ్య సామాజిక ఆర్థిక అసమానతలు ఉన్నాయి. కుటుంభ సామాజిక' ఆర్థిక స్థితిగతులు కుమారుణ్ణి ఆస్తిగా కుమార్తెను బాధ్యతగా భావించే సాంప్రదాయం కొనసాగుతుంది. కుమార్తెను ఆర్థిక భారంగా బావించే సామాజిక పరిస్థితి బాలికల పాలిట శాపంగా మారిందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. పుట్టబోయే బిడ్డ "ఆడశిశువు" అని తెలియగానే గుట్టు చప్పుడు కాకుండా గర్భస్రావానికి పాల్పడుతున్నారు.

**చట్టము ఉన్న ఫలితం సున్న**

1870 లో బ్రిటిష్ ప్రభుత్వం " ఆడశిశువు హత్యా నిరోధక చట్టం" తెచ్చినప్పటికి అమలుకు నోచుకోలేదు. 2020 లో ఐ'రా'స జనాభా నిధి సంస్థ విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం తల్లి కడుపులో పెరిగేది ఆడపిల్ల అని తెలిసిన మరు క్షణమే 4.58 కోట్ల మంది బాలికలు హత్యకు గురైనారని తెలిసింది.వాషింగ్టన్ కేంద్రంగా పని చేస్తున్న" ప్యూ రీసెర్చ్ సెంటర్" అధ్యయనం ప్రకారం 2009-2019 ఒక దశాబ్ద కాలంలో 90 లక్షల మంది పిల్లలుమరణించారని తెలిపింది. ఆడపిల్ల అంటే ఆడపిల్లనే అనే సంస్కృతి సమాజంలొ నెలకొనడం బాలికల పాలిట శాపంగా పరిణమించింది. తల్లి గర్భంలో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలియగానే "భ్రూణ హత్యలకు" పాల్పడటం సర్వసాధారణమైంది.

**ఆడపిల్లలు నిర్లక్ష్యం**

కుటుంబం నుండే ఆడపిల్ల పెంపకంలో నిర్లక్ష్యానికి వివక్షతకు గురికావడం విచారకరం. కుటుంభం నుండి మొదలైన వివక్షత నిర్లక్ష్యం చిన్న చూపు బాలికల అభివృద్ధికి వారి సాంస్కృతిక 'సాంఘీక ' ఆర్థిక' సామాజిక వికాసానికి గొడ్డలిపెట్టుగా పరిణమించింది . సమస్యల విషవలయంలో చిక్కుకు పోయిన ఆడ పిల్లలఅభివృద్ధి 'సంక్షేమం ఆశించిన మేరకు జరుగలేదు. ఆడ పిల్లలను కించపరచడం సామాజిక రుగ్మతైంది. పేదరికం' నిరుద్యోగం 'నిరక్షరాస్యత ఆడబిడ్డను పోషించే స్థోమత లేక బడుగు బలహీన వర్గాలు గిరిజన 'కొండజాతి ప్రజలు అడ శిశువులను విక్రయిస్తున్నారు. కష్టపడి పెంచి చదువులు చదివించి నప్పటికి పెళ్ళి టైంలో వరుడికి కట్నం కానుకలు ఇవ్వాల్సి వస్తుంది.వరకట్న దురాచార రద్దు కోసం చేసిన చట్టాలు అమలు కావడం లేదు. పుట్ట పోయే బిడ్డ ఆడబిడ్డ అని తెలిస్తే గర్భ స్రావం చేసే వైద్య వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. పెళ్ళి టైంలో బారీ కట్నం కానుకలు ఇవ్వలేమని .భార్యా భర్తల మధ్య గొడువలు అల్ప ఆదాయాలు ఆడ పిల్లను కనటానికి కుటుంబ సభ్యుల సపోర్ట్ లేకపోవడం. ప్రభుత్వం నుండి తగిన ప్రోత్సాహం లభించక పోవడం మొన్నగు కారణాలు ఆడ శిశువుల హత్యలను ఆపలేక పోతున్నాయి.

**బాలికలపై మహిళల పై పాఠశాలల్లో పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేదింపులు**

అత్యాచార ఘటనలు జరుగుతున్నాయి. మహిళల అక్రమ రవాణా మహిళపై దాడులుపెరుగుతున్నాయి. బాలికలకు భద్రత లేదు. ఇలాంటి స్థితి గమనించిన తల్లితండ్రులు ఆడపిల్లలను గర్భంలోనే తొలగించు కోవడానికిమొగ్గు చూపుతున్నారు. మొబైల్ స్కానింగ్ సెంటర్స్ ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడశిశువు అని తేలగానే భారీ సంఖ్యలో అబార్షన్లు చేయించుకుంటున్నారు. కొడుకు కావాలని కోరుకునే తల్లి తండ్రులను లక్ష్యంగా చేసుకొని స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు భారీగా డబ్బులుగుంజుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశములో ప్రతి 110 మంది బాలురకు కేవలం 100 మంది బాలికలే ఉన్నారని సర్వేల్లో తేలింది. చట్టాలు విఫలం బాలికలకు విద్య వైద్యం ఆహారం చట్టబద్ధమైన హక్కు ఆరోగ్య సంరక్షణ,' సామాజిక 'భద్రత బాల్యవివాహాలు నుండి బాలికలకు విముక్తి కల్పించాలని ప్రవేశపెట్టిన అనేక చట్టాలు' పథకాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు. సమస్యలే ఆడపిల్లల ఆస్తులుగా అవమానాలు నిర్లక్ష్యం అనారోగ్యం వేతన వివక్ష వారికి



ఆభరణాలుగా పరిణమించాయి.

**రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం**

కేంద్ర ప్రభుత్వం 2015లో చేపట్టిన " "భేటీ బచావో బేటి పడావో' అనే పథకం ఆడపిల్లల అభివృద్ధికి వారి సాంఘిక ఆర్థిక వికాసం కోసం ప్రవేశ పెట్టిన పథకం రాష్ట్ర ప్రభుత్వాల అమలులో నిర్లక్ష్యం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కేంద్ర మహిళా 'శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2015 ఏప్రిల్ నుండి జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడానికి నేషనల్ గర్ల్స్ డెవలప్ మెంట్ మిషన్ కార్యక్రమ రూపకల్పన జరిగింది.బాలికల సంరక్షణ కొరకు ఆడపిల్లలకు షరతులతో కూడిన ధనలక్ష్మి పథకం' కిశోరి శక్తి యోజన సుకన్య 'స్వమృద్ధి యోజన పౌష్టి ఆహార పథకం మొదలగు పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది 1989వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించి సభ్య దేశాలలో ఆడపిల్లల సామాజిక ఆర్థిక సాంఘిక సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు పూనుకున్నది.

**స్త్రీల నిరక్షరాస్యత**

జనాభాలో నేటికీ 20 కోట్ల మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. వీరిని అక్షరాస్యులను చేసినప్పుడు మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. తగ్గుతున్న స్త్రీ పురుష నిష్పత్తి రోజురోజుకీ ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది. ఇలాగే కొనసాగితే చాలా సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది 2011లో స్త్రీ పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 940 మంది స్త్రీలు ఉన్నారు. ఇందులో ఆరు సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలికలు ప్రతి వెయ్యి మంది బాలురకు 914 మంది మాత్రమే ఉన్నారు. బాల్యవివాహాలు దేశంలో 26.5శాతం బలవంతపు బాల్య వివాహాలు జరుగు తున్నాయి.ప్రపంచంలో జరుగుతున్న 40 శాతం బాల్యవివాహాలు మన దేశంలో జరుగుతున్నాయని "యూనిసెఫ్ "వెల్లడించింది . మన దేశంలో 40 శాతం బలవంతపు బాల్య వివాహాలు పశ్చిమబెంగాల్లో చోటుచేసుకోవడం గమనార్హం

**భ్రూణహత్యాలు**

ఆడపిల్లను మైనస్ గా భావించి మగ శిశువును ప్లస్ గా పరిగణించే మానసిక స్థితి సమాజంలో నెలకొనడం వల్ల పుట్టుకతోనే ఆడపిల్లల భ్రూణహత్యాలకు బలై వివక్షతకుగురౌతున్నారు. 1970 వ దశాబ్దంలో మగ పిల్లవాడు పుట్టే వరకు ఆడ పిల్లలను కనే వారు.జనాభా పెరుగుదల సమస్యగా మారడంతో గర్భస్రావం ఒక పరిష్కారంగా ముందుకు తీసుకు వచ్చింది. 1990 దశాబ్దంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ విధానాలు అందుబాటులోకి రావడం వల్ల భ్రూణ హత్యలు ఎక్కువైనాయి. కేంద్ర ప్రభుత్వం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టం-1994 లో ప్రవేశ పెట్టింది.2004 లో సవరించారు.ఐనప్పటికి గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. భ్రూణ హత్యలకు పాల్పడిన వారికి వారిని ప్రోత్సహించిన వారికి 50 వేల రూపాయల జరిమానా' జైలు శిక్ష విధించాలని నిబంధనలు పాటించకపోవడంశోచనీయం

**బాలికలు పేదరికం**

బాలికలకు ఉన్నత విద్య సమస్యగా మారింది. నేటికీ 40 శాతం పైగా బాలికలు పదవ తరగతి కంటే ముందే బడి మానేస్తున్నారు బడి మానుకొని గ్రామాలలో వ్యవసాయ రంగంలో అసంఘటిత 'ప్రైవేట్ రంగంలో బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. శ్రమ దోపిడీకి 'లైంగిక వివక్షతకు భిక్షాటనకు గురవుతూ తమ అమూల్యమైన బాల్య దశను పేదరికం 'ఆకలి చావులు అల్ప పౌష్టికాహారం అనారోగ్యానికి గురౌతున్నారని అనేక అద్యయనాలల్లోతేలింది. ప్రభుత్వం బాలికల సంరక్షణ చర్యలు బాలికల సమగ్ర వికాసానికి ' సంరక్షణకు అవసరమయ్యే విధానాలను అమలు చేయాలి.బాలికల భద్రత " లింగ నిష్పత్తి విద్య 'వైద్యం ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. బాలికలకు బాలురతో పాటు సమాన అవకాశాలు సమాన హక్కులు' స్వేచ్ఛ కల్పించాలి..బాలికల అభివృద్ధియే లక్ష్యంగా జాతీయ విద్యా విధానంలో పలు పథకాలు ప్రవేశపెట్టడం బాలికలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం సమాన విద్యావకాశాల సాధనకు" ప్రతేక నిధిని" కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమైనచర్య. బాలికల హక్కుల రక్షణ భద్రత పౌరసమాజం సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ఆడ పిల్లలను మగపిల్లలతో పోటీ పడేట్లు ప్రోత్సహించాలి .అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి . ఆడపిల్లల అభివృద్ధి దేశాభివృద్ధిగా భావించాలి. దేశ ప్రగతి పురోగతిలో ఆడపిల్లలు మానవ వనరులుగా ఎదగడానికి ప్రభుత్వం కృషి చేయాలి. బడుగు బలహీన వర్గాల్లో బాలికలకు ఉచిత విద్య వైద్యం అందించాలి. సమాజంలో మహిళాల పట్ల గౌరవంఆర్థిక స్థాయి.సామాజిక హోదా పెంచాలి. బాలికల సంరక్షణ ప్రభుత్వం బాల్య వివాహాలు బాలికల అక్రమ రవాణా' అత్యాచారాలు లైంగిక వివక్ష మొదలగు సమస్యల నుండి ఆడ పిల్లను సంరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి .పౌరసమాజం యువజన సంస్థలు 'మహిళా సంఘాలు 'స్వచ్ఛంద సంస్థలు ఆడపిల్లల సంరక్షణ హక్కులరక్షణకుపాటుపడాలి బాలికలు డిజిటల్ విద్య ప్రభుత్వం బాలికలకు డిజిటల్ విద్య టెక్నాలజీ ఆధునాతన సాంకేతిక ఉన్నత విద్య 'ఉపాధి దోహక విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలి . బాలికలకు వృత్తి నైపుణ్య విద్యను అందించాలి . బాలికల సామాజిక' ఆర్థిక స్థాయి పెంచే పథకాలను అమలు చేయాలి . మహిళా రిజర్వేషన్స్ కేంద్ర రాష్ట్ర 'ప్రభుత్వ 'ప్రైవేట్ రంగ ఉద్యోగ నియామకాల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వం మహిళా బిల్లును ప్రవేశ పెట్టి రాజకీయాలలో స్త్రీల వాటా పెంచాలి.

**మహిళా సాధికారిత**

ప్రభుత్వం మహిళా సాధికారిత సాధనకు ఉద్యమించాలి. శాస్త్ర సాంకేతిక 'పారిశ్రామిక 'వ్యవసాయ వ్యాపార 'వాణిజ్య 'రాజకీయ రంగాలలో మహిళా వికాసానికి ప్రభుత్వం పెద్ద పీట వెయ్యాలి .బాలికల కొరకు ప్రత్యేక పాఠశాలలు కళాశాలలు ఏర్పాటు చేసి ఇంటర్మీడియేట్ వరకు ఉచిత వొకేషనల్ విద్య అందించాలి. భ్రూణ హత్యలను నిరోధించే చట్టాలు అందుకు దారి తీసే పరిస్థితులపై పోరాడే చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి.వరకట్న నిషేధ చట్టం1961 లైంగిక నేరాల నుండి ఆడ పిల్లలకు రక్షణ కల్పించే.చట్టం2012ను సమర్థవంతంగా అమలు చేయాలి. మగ పిల్లల కోసం ఎదురుచూస్తున్న దంపతులను ఆశా కార్యకర్తలు అంగన్ వాడి కార్యకర్తలు గుర్తించి గర్భ స్రావం వల్ల కలిగే అనారోగ్యం నష్టాల పట్ల "కౌన్సెలింగ్ "ఇవ్వాలి. ప్రతి గ్రామంలో "గ్రామ సభ" తల్లుల సంఘాలు ' మహిళా సంక్షేమ చట్టాలు 'భ్రూణ హత్యలకు పాల్పడితే వేసే జరిమానాలు శిక్షల పట్ల చర్చలుజరపాలి .అవగాహన చైతన్యం కలిగించాలి. ఆడపిల్లలను పుట్టనిద్దాం బతుకనిద్దాం చదువనిద్దాం ఎధుగనిద్దాం అన్న నినాదం విధానమైనప్పుడే బాలికల సంక్షేమం అభివృధి భద్రత సమగ్ర అభివృధి జరుగుతుంది . అమ్మాయి లేనిదే అవని లేదు .స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదు. అందువల్ల ఆడపిల్లలను రక్షించుదాం. అమ్మాయిలను ఆదరిద్దాం. బాలికల భవితకు బంగారు బాటలు వేద్దాం .

నేదునూరి కనకయ్య

# మగ వాళ్లకు ఒకవరం



భర్త జీవించినంత కాలం భార్య జీవిస్తే మగవాళ్ళకి ఒక వరం, అందుకనేమో మన పెద్దలు వయసులో తేడా పెట్టారు, సహజంగా ఆడవాళ్లు భర్త చేతుల మీదుగా వెళ్లాలని కోరుకుం టారు, ప్రస్తుతం మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిన పరిస్థితుల్లో మగవాళ్లే భార్య చేతుల మీదగా వెళ్లాలి అని కోరుకుంటున్నారు..ఎసాధారణంగా భార్యాభర్తల్లో పురుషులు వయసులో పెద్దవారై ఉంటారు కాబట్టి, వారు తమ కన్నా ముందే మరణి స్తారనే అంశాన్ని జీర్ణించుకోవడానికి మహిళలు సిద్ధమై ఉంటారట. తన కన్నా చిన్నదైన భార్య చనిపోతుందనే సన్నద్ధతపురుషుల్లో ఉండదట. భార్య చనిపోతే భర్త కుంగు బాటుకు గురవడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణమం టున్నారు.. భార్య మీద జోకులేస్తారు. కోపమొస్తే అరుస్తారు, అలుగుతారు, తిడతారు. ఆమె శాశ్వతం గా దూరమైతే..మాత్రం తట్టుకొని బతికేంత..మానసిక బలం పురుషులకు ఉండదు... 'ఆమె' లేని మగాడి జీవితం, మోడువారిన చెట్టుతో సమానం!!' అడగకుండానే అన్నీ అమర్చిపెట్టినన్నాళ్లూ ఆమె విలువ తెలుసు కోలేని మహానుభావులుంటారు ఆమె వెళ్లిపోయిననాడు, మనసు లో మాటను చెప్పుకొనే తోడు లేక..,అందరితో కలవలేక.., మనసులోనేకు మిలిపోయి శారీరకంగా క్షీణించిపోతారు."నేను ముందు పోతే పసుపు, కుంకాలు మిగిలిపోతాయేమో గానీ., ఆ జీవుడు ఎంత అవస్థపడతాడో నాకు తెలుసు. పైనున్న భగవంతుడికి తెలుసు..'దేవుడా ఈ మనిషిని తీసుకెళ్లు, ఆ తర్వాత నా సంగతి చూడు' అని రోజూ దణ్నం పెట్టుకునేదాన్ని. జ'మొగుడి చావు కోరుకునే వారు ఉంటారా ఉండరు. నాకు మీ మావయ్యంటే చచ్చేంత ఇష్టంరా. ఆయన మాట చెల్లకపోయినా, కోరిక తీరకపోయినా, నా ప్రాణం కొట్టుకుపోయేది. చీకటంటే భయం. ఉరిమితే భయం. మెరుపంటే భయం. నే వెన్నంటి ఉం డకపోతే ధైర్యం ఎవరిస్తారు ? అర్ధరాత్రిపూట ఆకలేస్తోందని లేచి కూర్చుంటే ఆవిరికుడుములూ కందట్లూ పొంగరాలూ ఎవరు చేసి పెడతారు ?"ప్రముఖ రచయిత శ్రీరమణ రాసిన.., నటుడు ప్రయోక్త శ్రీ తనికెళ్ళ భరణి తీసిన 'మిథునం'లో భర్త మరణం గురించి బుచ్చిలక్ష్మి పాత్ర ఆవేదన ఇది ! నటుడు రంగనాథ్ గుర్తున్నారా ? భార్యతో అపూర్వమైన అనుబంధం ఆయనది. మేడ మీద నుంచి పడటంతో నడుం విరిగి ఆవిడ మంచాన పడితే.. పద్నాలుగేళ్లపాటు ఆమెకు సేవలు చేశారాయన ! తాను ఎంతగానో ప్రేమించిన భార్య శాశ్వతంగా దూరమవడాన్ని తట్టుకోలేక కుంగుబాటుకు గురై 2015లో ఉరి వేసుకుని చనిపోయారు. ప్రముఖ చిత్రకారుడు, దర్శకుడు బాపు సైతం., భార్య భాగ్యవతి మరణాన్ని తట్టుకోలేక ఆమె వెళ్లిన ఏడాదిన్నరలోపే తుదిశ్వాస విడిచారు. సాధారణంగా భార్య అంటే చాలా మందికి చులకన భావం ఉంటుంది.భార్య తన మీద ఆధారపడి ఉందని.,తాను తప్పఆమెకు దిక్కులేదని చాలామంది పురుషులు అనుకుంటారు. కానీ వాస్తవంలో అం దుకు విరుద్ధంగా జరుగుతుంది. చాలామంది పురుషులు తమకు తెలియకుండానే భార్యపై మానసికంగా ఆధారపడిపోతారు. భార్యను కోల్పోయినప్పుడు ఆ లోటు వారికి బాగా తెలుస్తుంది. వారి జీవితం గందరగోళంలో పడిపోతుంది..భాగస్వామి దూర మైనప్పుడు మహిళలు స్పందించే తీరు భిన్నంగా ఉంటుంది. భర్తకు దూరమైన తరువాత మహిళలు కుటుంబ సభ్యులతో కలిసిపోవడం, కొన్ని బరువు బాధ్యతలు తీసుకుంటారు.స్త్రీ చిన్నప్పటి నుంచి స్వతంత్రంగా బతుకుతుంది తండ్రికి బాగోలేక పోయినా, భర్తకు జ్వరం వచ్చినా, పిల్లలకు జలుబు చేసినా తనే సేవ చేస్తుంది. అదే తనకు ఏదైనా అయితే ఎవరి కోసం ఎదురు చూడదు. తనకు తానే మందులు వేసుకుంటుంది. ఓపిక లేక పోయినా లేచి పనులు చేసుకోవడానికి యత్నిస్తుంది. ఆ మనోబ లమే.,భర్తలేకపోయినాధైర్యంగాబతకడానికిఉపయోగపడుతుంది.

**-భావోద్వేగ బలం ఆమెదే !**

పురుషుడు శారీరకంగా బలంగా ఉంటే, స్త్రీ భావోద్వేగాల పరంగా బలంగా ఉంటుంది.సామాజిక బాధ్యతలు భర్త తీసుకుం టే, భార్య కుటుంబ బాధ్యత మోస్తుంది. ఒక విధంగా చెప్పాలం టే.. ఇంట్లో ఆమే రిమోట్ కంట్రోల్. ఎక్కడ ఏది నొక్కాలో ఆమెకే తెలుసు. ఎంతటి భావోద్వేగాన్నయినా భరిస్తుంది. పిల్లలే సర్వస్వంగా బతుకుతుంది. అందుకే భర్త తనువు చాలించినా పిల్లల కోసం తను కష్టపడుతుంది..

సేనాధిపత్యం రమేష్

## ఉన్నత వ్యక్తిత్వానికి ప్రతిరూపం

# శ్రీకృష్ణ భగవానుడు

(ఈనెల 27న గోకులాష్టమి సందర్భంగా )

భగవంతునికి చెందిన అత్యున్నత వ్యక్తిత్వానికి శ్రీకృష్ణుడు ప్రతిరూపం. పురాణేతిహాసాల ప్రకారం కృష్ణుడిని విష్ణువుకి చెందిన ఎనిమిదవ అవతారంగా చెబుతారు. శ్రీకృష్ణుడి బోధించిన భగవద్గీత మనిషిని కష్ట సమయాల్లో కూడా ముందుకు నడిచేలా ప్రోత్సాహమిస్తుంది. ప్రతి మనిషి సానుకూల వైఖరితో ముందుకు సాగేలా ఎంతగానో దోహదం చేస్తుంది. వృత్తి ధర్మాన్ని పాటించడానికి మించిన భక్తి వేరొకటి లేదని శ్రీకృష్ణుడు సందేశమిచ్చాడు. ధర్మాన్ని నిలబెట్టడానికి, మానవాళిని సంరక్షించడానికి విష్ణుమూర్తి ఎత్తిన ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణ అవతారం. తన మామ కంసుడు చేస్తున్న దాష్టీకాల నుంచి ప్రజలను రక్షించేందుకు, అసుర సంహారం చేసి భూలోకంలో తిరిగి ధర్మస్థాపన చేశాడు. ధర్మాన్ని పాటించిన పాండవులకు అండగా నిలిచి వారిని గెలిపించాడు. గీత ద్వారా యుద్ధరంగంలో అర్జునుడికి హితబోధ చేశాడు. పుట్టుకచావుల పరమార్థం అవగతం చేశాడు.అల్లరి బాలకుడిగా, వెన్నదొంగగా, గోపీలోలుడిగా, గోవర్ధన గిరిధారిగా, కాళీయమర్ధనుడిగా, గీతాప్రబోధకుడిగా, అసుర సంహారిగా మానవాళికి అద్భుతమైన సందేశాన్నిస్తూనే ఉన్నాడు. వెన్నను దొంగిలించి గోపబాలురకు పంచి పెట్టడం ద్వారా.. మనకున్నది నలుగురికివ్వడం వల్ల కలిగే సంతోషం ఎలా ఉంటుందో చేసి చూపించాడు.తనకు బదులుగా గోవర్ధన గిరిని పూజించారనే కోపంతో ఇంద్రుడు రేపల్లెపై ఏకధాటిగా వానను కురిపిస్తే.. ఆ దాడి నుంచి తనవారిని, పశు పక్ష్యాదులను రక్షించడానికి.. గోవర్ధన పర్వతాన్ని తన చిటికెన వేలుపై నిలిపాడు. ఆ విధంగా ఇంద్రుడి మదాన్ని అణిచాడు. పుట్టగానే తల్లిదండ్రులకు, యుద్ధ భూమిలో అర్జునుడికి కర్తవ్య బోధ చేశాడు. అందుకే ఆయనను 'కృష్ణం వందే జగద్గురుమ్' అని కీర్తిస్తారు.కృష్ణతత్వం అనంతమైనది. ఆయన లీలలు అనంతమైనవి. కుచేలుని నుంచి అటుకులు గ్రహించి అంతులేని సిరిసంపదలు ప్రసాదించిన కృష్ణుడు ప్రేమతో, భక్తితో తనకు ఏది సమర్పించినా ఆనందంగా స్వీకరిస్తాడు. భోగభాగ్యాలు ప్రసాదిస్తాడు. అలాగే కర్మ ఫలాన్ని సైతం అనుభవించాల్సిందేనంటాడు. దీనికి కుచేలుడే ఉదాహరణ. సుధాముడు తన స్నేహితుడే అయినప్పటికీ, కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నప్పటికీ కర్మ ఫలితం తీరేదాకా అనుగ్రహించలేదాయన.అలాగే, మహాభారత యుద్ధంలోనూ తన యుద్ధనీతిని ప్రదర్శించాడు. అధర్మాన్ని అంతమొందించడానికి మాయోపాయాలు పన్నాడు. అబద్ధమాడని ధర్మరాజు చేత 'అశ్వత్థామ హత: కుంజర:' అని



అబద్ధమాడించాడు. కర్ణుడిని నిస్సహాయుణ్ని చేయడానికి విదురుడ్ని, భీష్ముడిని నిలువరించడానికి శిఖండిని ఉపయోగించాడు. యుద్ధంలో ఓడిపోయిన తర్వాత చెరువులో దాక్కున్న దుర్యోధనుడిని సంహరించడానికి సైతం మాయోపాయాన్నే పన్నాడు. ఇలా శ్రీ కృష్ణలీలలు ఎన్నో. ఎన్నెన్నో.హిందూ మతస్థులు శ్రావణ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ముఖ్యంగా మహిళలు తమ సౌభాగ్యం కోసం మంగళగౌరి, శ్రావణగౌరి వ్రతాలు చేస్తారు. ఈ మాసంలో వచ్చే మరో విశిష్టమైన పర్వదినమే శ్రీకృష్ణాష్టమి. దీనినే జన్మాష్టమి , గోకులాష్టమి, శ్రీకృష్ణ జయంతిగా జరుపుకుంటారు. ఈ పర్వదినం నాడు తల్లులందరూ తమని తాము దేవకీ,యశోదలుగా భావించుకుంటూ తమ బిడ్డలనే శ్రీకృష్ణుడి ప్రతిరూపాలుగా భావిస్తారు.తన లీలల ద్వారా భక్తి, జ్ఞానం, యోగం, మోక్షాల గురించి ప్రపంచానికి తెలియ చేసిన శ్రీకృష్ణపరమాత్మ. ధర్మమార్గాన్ని అనుసరించి జీవితానికి సార్థకత ఏర్పరచుకోవాలని దివ్యోపదేశం చేశాడు . శ్రీకృష్ణుడు శ్రావణ మాసంలో వచ్చే బహుళ అష్టమి రోజు జన్మించాడు. ఆ రోజునే మనం కృష్ణాష్టమిగా జరుపుకుంటున్నాం. కృష్ణుడు అర్థరాత్రి జన్మించాడు, కాబట్టి కృష్ణాష్టమి పూజను రాత్రి సమయంలో చేసే ఆచారం కొన్నిప్రాంతాలలో ఉంది.శ్రీకృష్ణాష్టమి రోజు ఉదయాన్నే నిద్రలేచి అభ్యంగన స్నానం చేసి, గుమ్మానికి మామిడి తోరణాలు కట్టి, గడపలకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టాలి. బాలకృష్ణుడిని ఇంట్లోకి ఆహ్వానిస్తున్నట్లుగా కృష్ణ పాద ముద్రలు వేయాలి.జన్మాష్టమి రోజు మనం చిన్నికృష్ణుణ్ని ఆరాధిస్తాం. అంటే చిన్న పిల్లలకు ఒంటికి నూనె రాసి, నలుగు పెట్టి, స్నానం చేయించి, అలంకరించి ఎంత మురిపెంగా చూసుకుంటామో.. ఈ రోజు చిన్ని కృష్ణున్ని కూడా అలాగే ఆరాధించాలి. చిన్ని కృష్ణుడి విగ్రహానికి పంచామృతాలతో ఆ తర్వాత గోరువెచ్చని నీటితో అభిషేకం చేయాలి. అనంతరం నూతన వస్త్రాలు కట్టి, ఆభరణాలు అలంకరించాలి.కృష్ణుడికి తులసీ దళాలంటే మక్కువ. కాబట్టి తులసిమాలను మెడలో వేయాలి. పూజ కోసం పొన్న పూలను వినియోగించాలి. ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించాలి. ఆ తర్వాత ఊయలలో విగ్రహాన్ని ఉంచి లాలి పాట పాడుతూ ఊయలను ఊపాలి. ముత్తయిదువలను పిలిచి వాయినాలివ్వాలి. అనంతరం గీతాపఠనం చేయాలి. కృష్ణుడంటేనే బాలతత్వం. బాల కృష్ణుడు పుట్టిన కృష్ణాష్టమి రోజు కృష్ణాష్టమి వ్రతం చేయడం హిందూ సంప్రదాయంలో ఉంది. అష్టమీ తిథి రోహిణీ నక్షత్రం అర్ధరాత్రి సమయంలో ఉన్నప్పుడు మాత్రమే ఈ వ్రతాన్ని నిర్వహిస్తారు.కృష్ణుడికి వెన్న అంటే బాగా ఇష్టం. కాబట్టి కృష్ణాష్టమి రోజు వెన్ననే కృష్ణుడికి నైవేద్యంగా పెడతారు. అయితే శాస్త్రం ప్రకారం కృష్టాష్టమి నాడు 102 రకాల పిండి వంటలు చేయాలి. ఆరు రకాల పానీయాలు తయారు చేసి నైవేద్యం పెట్టాలి. వాటిని ముందు మనం ఆరగించి ఇతరులకు పంచిపెట్టాలి. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వెన్న, పాలు, పెరుగు, బెల్లం, అటుకులు, శెనగపప్పు వంటి వాటిని కూడా నివేదన చేస్తారు.అలాగే శొంఠితో తయారుచేసిన కట్టెకారం, పంచదార కలిపిన మినప్పిండి కూడా ప్రసాదంగా పెడతారు. ఈ రెండూ బాలింతలకు పెట్టే ఆహారం కావడం గమనించదగిన విషయం. శ్రీకృష్ణునికి జన్మనిచ్చిన దేవకీ దేవి, మాయకు జన్మనిచ్చిన యశోదా దేవి ఇద్దరూ బాలింతలే. కాబట్టి ఇలాంటి ఆహారం పెట్టడానికి వారే కారణమై ఉంటుందంటారు. కృష్ణాష్టమి పూజలో భాగంగా గుమ్మం దగ్గరి నుంచి పూజ మంటపం వరకు శ్రీ కృష్ణ పాదాలను వేస్తుంటారు. ఈ ప్రక్రియ భారతదేశమంతటా కనిపిస్తుంది. దీని కోసం ఒక్కొక్కరూ ఒక్కో పద్ధతిని పాటిస్తారు. అసలు ఇలా వేయడం వెనక ఉన్న అంతరార్థం బాల కృష్ణున్ని ఇంట్లోకి ఆహ్వానించడమే. ఇలా చేయడం వల్ల తమ ఇంట్లోకి సుఖసంతోషాలు ప్రవేశిస్తాయని నమ్ముతారు. పూజా మందిరాన్ని మన అంతరంగంగా భావిస్తే.. కృష్ణ పాదాలు మన అంతరంగాన్ని తెలుసుకొనేలా చేసే దిక్సూచిగా చెబుతారు. కృష్ణాష్టమి సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉట్టి కొడతారు. దీనినే ఉత్తర భారతంలో 'దహీ హండి' అని పిలుస్తారు.

- దాసరి దుర్గా ప్రసాద్

# సకల కళావల్లభులు...

## రాధాకృష్ణుల వేషధారణలో జాకేరు సర్పంచ్ దంపతులు అందరిని విశేషంగా ఆకట్టుకున్న వేషధారణ



**వేపాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**మండలంలోని జాకేరు గ్రామ సర్పంచ్ బుద్ద చిన్నమ్మలు, అప్పల నాయుడు దంపతులు శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా వేసిన రాధాకృష్ణుల వేషధారణ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. నిజ జీవితంలో కూడా రాధాకృష్ణుల మాదిరిగా కనిపించే ఈ జంట సకల కళావల్ల భులేనని చెప్పవచ్చు.ముఖ్యంగా ఈ దంపతులు సేవాగుణంతో అందరికీ ఇతోధికంగా సాయప డతారన డంలో సందేహం లేదు. పేదింటిలో ఎవరికైనా పెళ్లి జరిగితే వారికి తూ.చ తప్పకుండా ఉచితంగా తాళిబొట్టు, పెళ్లిబట్టలు అందించడం వారికి అలవాటు. ఒక పక్క రాజకీయాలు చేస్తూ మరోపక్క వ్యాపారం చేస్తూ వచ్చిన రాబడిలో కొంత ఖర్చు చేయడం మిగిలిన సొమ్మును గ్రామంలో జరిగే పండగలు, పబ్బాలు, తీర్ధమహోత్సవాలకు ఖర్చు చేస్తూ ప్రజాభిమానం పొందడంలో వారికి వారే సాటని చెప్పవచ్చు.

# ఘనంగా కొవ్వలి నాయుడు పుట్టినరోజు వేడుకలు

**మొగల్తూరు, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు గాంధీ బొమ్మ సెంటర్లో మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు అభిమానులు ఏర్పాటు చేసిన కేకులు కట్ చేసి అక్కడ ఉన్న అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడుకు టిడిపి నాయకులు కార్యకర్తలు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు కత్తి మండ వెంకట ముత్యాలరావు, బొల్లా చంటి, ముక్కు పుల్లయ్య నాయుడు, లక్కు బాలాజీ, మెండే రాజేష్ కుమార్, పాల రాంబాబు, బల్ల శ్రీనివాస్, డోల్లా రత్నం రాజు, గుడాల చింతన్న, కొత్తపల్లి నాగరాజు, మైలబత్తుల రాంబాబు,పాము శ్రీధర్, వెలిది పాపారావు, దేశం శెట్టి శ్రీనివాస్, దొంగ స్వామి, కొల్లాటి చక్రవర్తి, కుక్కల వాసు, పాల్గొన్నారు.

# గొల్లగూడెంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**మొగల్తూరు, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు గ్రామం గొల్లగూడెంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శ్రీకృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించి అనంతరం ప్రత్యేక వాహనంలో శ్రీ స్వామివారి నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. బాణా సంచ దారిపొడుగునా కాలుస్తూ మొగల్తూరు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు స్వామివారిని భక్తశ్రద్ధలతో దర్శించుకుని బియ్యం బెల్లం ముక్క నగదు అరటిపళ్ళు కొబ్బరికాయ, పువ్వులు అగరతులు సమర్పించారు. యువత దారి పొడవునా డీజే డాన్సులు చేసుకుంటూ ముందుకు సాగారు. రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమం వైభవముగా జరిపారు. విజేతలకు బహుమతులు ప్రధానం గావించారు.

# ఆర్కే బీచ్ వద్ద ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ

## వర్షం కారణంగా మార్పు చేసిన అధికారులు..

**విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ స్థానిక ఆర్.కె. బీచ్ వద్ద ప్రారంభమయ్యింది. ర్యాలీ నిర్వహణకు పోర్టు స్టేడియంలో అన్ని ఏర్పాట్లూ చేసినప్పటికీ ఆదివారం రాత్రి వర్షం కారణంగా ట్రాక్ అంతా తడిసిపోయింది. బురదగా ఉండి జారుతుందనే కారణంతో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచనతో అధికారులు ర్యాలీని బీచ్ రోడ్లో నిర్వహించారు. పోర్ట్ స్టేడియంలో చేసిన ఏర్పాట్లు అన్నీ వృధా అయ్యాయి. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా అభ్యర్థులు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అధికారులు దానికి తగిన ఏర్పాట్లు చేశారు. వందలాది మంది అభ్యర్థులు ర్యాలీలో పాల్గొన్నారు.



# కే.పీ.పాలెంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**మొగల్తూరు, ఆగస్టు 25 (ఆంధ్రపత్రిక):** మొగల్తూరు మండలం కే.పీ.పాలెం నార్త్ గ్రామంలో శ్రీ శ్రీకృష్ణుడు ఆలయం నందు కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

# సేవాగుణాన్ని చాటుకున్న గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు

## క్యాన్సర్ చికిత్స కోసం రూ.10వేల 700లు అందజేత. బాధితుడు రంభ అప్పారావు కుటుంబీకుల్లో ఆనందం



**వేపాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**మండల కేంద్రం వేపాడకు చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ పేరుకు తగ్గట్టే సభ్యుల హృదయం కూడా బంగారమే అని చెప్పక తప్పదు.వేపాడ గ్రామంలోని ఎందరో బాధితులను అక్కున చేర్చుకుని లక్షలాది రూపాయలను అందించి అందరి మన్ననలను అందుకున్న సంగతి అందరికీ తెలిసిందే. తాజాగా గ్రామానికి చెందిన రంభ అప్పారావు అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు సోమవారం అతనికి ఆపన్న హస్తం అందించారు. ట్రస్టు సభ్యులు తలో చెయ్యి వేసి రూ 10వేల 700లను పోగుచేసి బాధితుడు అప్పారావుకి అందజేశారు. ట్రస్టు సభ్యులు చేసిన ఉదార సాయం పట్ల బాధితుడి కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు.

# నేడే నాగులాపల్లిలో పోతురాజుబాబు పండుగ



**మునగపాక, ఆగష్టు 26 (ఆంధ్రపత్రిక):**మునగపాక మండలంలోని నాగులాపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ పోతురాజుబాబు పండగ మహోత్సవం ఈ నెల 24వ తేదీ, మంగళవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పెతకంశెట్టి రాజునాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ దొడ్డి బుజ్జి తెలిపారు. ఈ మేరకు పోతురాజుబాబు ఆలయాన్ని, గ్రామం అంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకములు నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం గ్రామ పురవీధుల్లో ఘటాల ఊరేగింపు, రాత్రి 8 గంటల నుంచి గ్రామంలో ప్రధాన కూడళ్ల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**మొగల్తూరు, ఆగస్టు 26(ఆంధ్రపత్రిక):**పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలో గల శ్రీకృష్ణుడు ఆలయం నందు సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయత్తుకులు వాడపల్లి గోపాలకృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అత్యంత వైభవముగా జరిపారు. అనంతరం ఆలయానికి చేసిన భక్తులకు ప్రసాదాలను కమిటీ సభ్యులు పంపిణీ చేశారు.



# వచ్చేనెల ఒకటి నుంచి బి.జె.పి.సభ్యత్వ నమోదు



**కె.కోటపాడు, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** వచ్చేనెల ఒకటవ తేదీ నుంచి ప్రతి గ్రామంలో బి.జె.పి. సభ్యత నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు తెలిపారు. సోమవారం మండల కేంద్ర కోటపాడులో బిజెపి కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో అయన మాట్లాడారు. సెప్టెంబర్ ఒకటవ తేదీన మండలంలోని బి.జె.పి. శ్రేణులు అందరూ మండల కేంద్రం కె.కోటపాడులో ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.జె.పి.ప్రధాన కార్యదర్శి ఇమంది సన్యాశిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శరగడం సన్యాసినాయుడు, బిజెపి నాయకులు కొట్టాన అశోక్, బండారు సత్యనారాయణపాత్రుడు, జనపరెడ్డి సూర్యనారాయణ, సూరిశెట్టి దాసు, సిరపరపు శివ, బొడ్డు శ్రీరామ్మూర్తి, పైలా అమ్మాజీ పాల్గొన్నారు.

# నాగులాపల్లి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఘనంగా 6వ వార్షికోత్సవ వేడుకలు

**మునగపాక, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**యావత్ ప్రపంచం ధ్యానంపై దృష్టి పెట్టి అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని బుద్ధ సీఈవో పొలమరశెట్టి చంద్రశేఖర్ అన్నారు. నాగులపల్లి చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆరవ వార్షికోత్సవ వేడుకలు రెండు రోజులపాటు ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ధ్యానంలో తాము పొందిన అనుభవాలను వివరించారు. సోమవారం ధ్యాన కేంద్రంలో జరిగిన వేడుకలకు చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచంలో ప్రముఖ కంపెనీల సీఈవోలు అందరు మంచి ఫలితాలు సాధించటం కోసం తమ సిబ్బందికి ధ్యానంపై అవగాహన కల్పిస్తున్నారు అన్నారు. ధ్యాన గురువు సుజాత ఆధ్వర్యంలో సోమవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కృష్ణాష్టమి సంధర్భంగా ఉట్టు కొట్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



ఎం.ఈ.ఓ మళ్ల సూర్యారావు, రోటరీ క్లబ్ కార్యదర్శి అనిల్, సాయికుల్వంత్ అధినేత కామరాజు, శ్రావణి, శశికళ, వాణిబాల, రవణమ్మ, కోయిలాడ శివాజీ, జగన్, మాణిక్యం, మణి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్ల సురేంద్ర జన్మదిన వేడుకలు

**అనకాపల్లి. ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**పట్టణంలో తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర జన్మదిన వేడుకలు తెలుగుదేశం పార్టీ నాయకులు, సురేంద్ర మండల సభ్యులు ఆధ్వర్యంలో సురేంద్ర స్వగృహం వద్ద ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి మాజీ శాసనసభ్యులుపీలా గోవింద్ సత్యనారాయణ జనసేన పార్టీ నాయకులు బీమెరాశెట్టి రాంకీ, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, టిడిపి జిల్లా అధ్యక్షులు బొత్తులు తాతయ్య బాబు, ఎలమంచిలి టిడిపి ఇంచార్జ్ ప్రగాఢ నాగేశ్వరరావు, మాడుగుల టిడిపి ఇంచార్జ్ పివి జి.కుమార్, ప్రత్యేక అతిథిగా విచ్చేసిన చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాధ రావు మరియు కూటమి పార్టీ నాయకులు సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించి, అతిధులందరూ మల్ల సురేంద్ర మొదటినుండి కల్మషం లేని మనిషిగా, చేతనేనంతవరకు ప్రతి కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తాడని, తెలుగుదేశం పార్టీలో 30 సంవత్సరాలుగా పార్టీకి విధేయుడుగా, పార్టీ కష్టసుఖాల్లో నేనున్నానంటూ నడిపించిన సురేంద్రకి ఈ కూటమి ప్రభుత్వంలో మంచి అత్యున్నత పదవి రావాలని అందరూ తెలుపుతూ శుభాకాంక్షలు



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా పార్టీ నాయకులు, జీవీఎంసీ ఇన్చార్జులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగస్తులు, మిత్రులు,అనేక సంస్థల ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుండి అధిక స్థాయిలో నాయకులు విచ్చేసి సురేంద్ర శుభాకాంక్షలు తెలియజేశారు.

# హరేకృష్ణ సత్సంగ ఆశ్రమంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**అనకాపల్లి, ఆగస్ట్ 26 (ఆంధ్రపత్రిక):**హరేకృష్ణ సత్సంగ ఆశ్రమం, పట్నంలోని బైపాస్ రోడ్డు సమీపంలో డైట్ ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముందు రోజు ఉట్టి ఉత్సవము యువతి యువకులందరూ ఈ ఉత్సవములో ఆనందోత్సవాన్ని పొందారని మందిర అధ్యక్షులు: శ్రీమాన్ దుర్లభ కృష్ణ ప్రేమదాస్ తెలిపారు. చిన్నారులు కృష్ణ వేషధారణలో అలరించడమే కాకుండా కొంతమంది భగవద్గీత శ్లోకాలను అనర్గళంగా చెప్పారు. కోలాట నృత్య ప్రదర్శన అలాగే మహా అభిషేకం, పంచామృత, మహా కలశాభిషేకం, తులసీ పూజ, సంధ్యా ఆరతి, శ్రీ కృష్ణ లీలామృతం ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమములు, కృష్ణ జన్మాష్టమి కాంపిటేషన్స్ విద్యార్థినీ విద్యార్థులకు బహుమతుల ప్రదానం, పవళింపు సేవ, శ్రీల ప్రభుపాదుల వాం ఆవిర్భావం మహా అన్నప్రసాద వితరణ రెండో రోజు కార్యక్రమాల్లో గురు పూజ, భాగవత ప్రవచనం, బాల గోపాలుడి ఊంజల సేవ మరియు సాంస్కృతిక కార్యక్రమములు, శ్రీ కృష్ణ లీలామృతం ప్రవచనం, శ్రీ రాధా గిరిధారి భగవానునికి పంచామృత, ఫలరస మరియు మహా కలశాభిషేకం పట్నంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు. విద్యార్థులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**మునగపాక, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**మునగపాక మండలం పాటిపల్లి గొల్లపేట గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో పల్లా సన్యాసిరావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, స్వామివారికి అభిషేకం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీమురిసి సంతోష్, పల్లా రమణ, మొల్లి గోవిందా, పల్లా కృష్ణ, పల్లా సంతోష్, పల్లా వెంకట అప్పారావు, ఎదురు రమణ అప్పారావు, చొప్పా దుర్గ నాయుడు, బర్నికాన నాగేశ్వరరావు, మొల్లి శివాల నాయుడు, శ్రీమురిసి సన్న అప్పారావు, శ్రీకృష్ణ యూత్ సభ్యులు, మహిళా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# ఫార్మా సిటీ ప్రమాదాలన్నీ యాజమాన్యం హత్యలే

## ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలి -సీపీఎం

**అచ్యుతాపురం, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**ఫార్మాసిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలన్నీ యాజమాన్యం యొక్క హత్యలే అని అనకాపల్లి జిల్లా సిపిఎం కార్యదర్శి వర్గసభ్యులు జి.కోటేశ్వరరావు తెలిపారు. అచ్యుతాపురం ఎస్సీ జడ్ ఎస్సెన్షియ ఘటన మరువక ముందే 22-8-2024న రాత్రి పరవాడ ఎస్ఇజెడ్‌లోని సినర్జీన్ కంపెనీలో రియాక్టర్ పేలి 4గురు కార్మికులు 60% పైబడి తీవ్రగాయాలతో ఇండస్ హాస్పటల్‌లో చేరారు. వీరిలో ముగ్గురు జార్ఖాండ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా విజయనగరానికి చెందిన సూర్యనారాయణ అనే కార్మికుడు కూడా వున్నారు. వీరిలో ఇప్పటికీ జార్ఖాండ్ చెందిన కార్మికుడు చనిపోగా సూర్యనారాయణ ఈ రోజు ఉదయం ప్రాణాలు కొల్పోయారు. సూర్యనారాయణకు భార్య సునీత, ఇద్దరు చిన్న పిల్లలు వున్నారు. ఎషాన్షియా ప్రమా




దంలో చనిపోయిన కార్మికులకు చెల్లించిన విధంగానే వీరికి కూడా కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని బాధిత కుటుంబాలకు అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము, సిపిఎం నాయకులు కే.సోమునాయుడు, బుద్ధ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రపత్రిక
జిల్లాలకు విలేఖరులు కావలెను
స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914
విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని నియోజకవర్గాలకు మరియు మండలాల వారిగా విలేఖర్లు కావలెను.
శ్రీకాకుళం జిల్లా అంతటా మరియు
విజయనగరంలో ఎస్.కోట, జామి,
గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, ఎల్.కోట, రాజాం.
ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

# మెగా గుండె సంబంధిత ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి





**అయినవిల్లి ,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లి పాలెం గ్రామంలో గుండె సంబంధిత మెగా వైద్య శిబిరం ను మెడ్ యునైటెడ్ ఆసుపత్రి అమలాపురం వారిచే చిరంజీవి పుట్టినరోజు వేడుకలు సందర్భంగా సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన వైద్య శిబిరము ను పీ. గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ శిబిరము సర్పంచ్ సలాది బుచ్చిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేయబడినది. ఈ సందర్భంగా ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధుల గురించి పరీక్షలు నిర్వహించినారు. బిపి, షుగర్, పరీక్షలు చేసి, మరియు ఈసీజీ తీసినారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినారు .డాక్టర్ దంగేటి గురు కిరణ్ ,డాక్టర్ జాయ్ సన్ బృందం వైద్య సేవలు అందించినారు .ఈ సందర్భంగా శాసనసభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత వలన 45 సంవత్సరములు దాటిన వారికి బిపి సోకిన ,వారికి సరైన అవగాహన లేక వైద్యం చేయించుకునే వెసులుబాటు లేక హృదయ సంబంధిత రోగములు వచ్చుచున్నవని, ప్రభుత్వం కూడా ఆధునికమైన వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని, సేవ భావ ముతో కొన్ని వైద్య సంస్థలు ఉచితంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఉచిత వైద్య సేవలు చేయుచున్నారని ఇటువంటి సేవలను ప్రతి ఒక్కరు కూడా ఉపయోగించుకోవాలని, డాక్టర్ దేవుడితో సమానమని, వైద్య సేవలు చేసే ప్రతి ఒక్కరికి కూడా ధన్యవాదములు తెలిపినారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరియు రాష్ట్ర సర్పంచుల సమైక్య కార్యదర్శి సలాది బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ అడపా వెంకట నాగభూషణం, ఉమ్మడి జిల్లాజనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు ,ఎక్స్ మండల ఎంపీపీ సలాది పుల్లయ్య నాయుడు, అయినవిల్లి మండలం జనసేన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోలిశెట్టి రాజేష్, చిట్టూరి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యులు మద్దాల సుబ్బారావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మద్దా చంటి బాబు, సర్పంచ్ మేడిద దుర్గా ప్రసాద్, వార లక్ష్మీనరసింహ రామ్, ఎక్స్ నీటిపారుదల అధ్యక్షులు ముద్రగెడ వెంకట సత్య సుబ్బారావు, ఉప సర్పంచ్ మేడిశెట్టి రాంబాబు ,స్కూల్ కమిటీ చైర్మన్ అడపా ఆదిబాబు, అడపా నాగేశ్వరరావు, అరిగిన సూరిబాబు, అడపా కళ్యాణ్ ,వీళ్ళ దొరబాబు (ఎన్నారై) తెలుగుదేశం పార్టీ యువత అధ్యక్షులు మేడిశెట్టి అంజిబాబు, (ఎన్నారై) , జనసేన తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు పురం శెట్టి అరుణ్, మేడిశెట్టి సత్తిబాబు ,సుందరినీడి నాని, ర్యాలీ వంశీ ,విల్ల గోపి, కోరపు ఈశ్వరరావు, దామిశెట్టి రామకృష్ణ ,అడపా వీరేశ్వర రావు, జునిపే శ్రీను, కామిశెట్టి నాగబాబు, అడప చిన్న, సలాది నాని, దామిశెట్టి చిట్టి బాబు, దాంశెట్టి రాంబాబు, సలాది స్వామి నాయుడు, దామ్మిశెట్టి గాంధీ , సలాది భద్రం, ఆసుపత్రి సిబ్బంది, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు అడబాల సత్యనారాయణ, లక్ష్మణరావు, కుమార్, పెద్దిరాజు, రాధాకృష్ణ, శైలా ,ఇందిరా, ఉమ్మడి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోర్టులో జేసీ రాహుల్ మీనా తనిఖీలు



**కాకినాడ, ఆగస్టు 26(ఆంధ్రపత్రిక):** కాకినాడ యాంకరేజ్ పోర్టును సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్ ఎస్ భావన, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కాకినాడ పోర్టో అక్రమ బియ్యం ఎగుమతులను అరికట్టే చర్యల్లో భాగంగా ఇటీవల ఏర్పాటు చేసిన బొంబాయి కాటా, శక్తి గేట్ వద్ద ఉన్న రెండు చెక్ పోస్టను జేసీ రాహుల్ మీనా ఈ సందర్భంగా తనిఖీ చేశారు. పోర్టులోకి నిత్యం వస్తున్న బియ్యం లారీల సంఖ్య, వాహనాలను తనిఖీ చేస్తున తీరు, చెక్ పోస్టుల్లో డ్యూటీ అధికారులు వాహనాలను తనిఖీ చేసి గేటు పాస్ ఇవ్వడం, తదుపరి వాహనాలు పోర్టో అన్ లోడ్ చేసుకుని బీఓసీ గేటు ద్వారా బయటకు వచ్చే విధానం వంటి వివరాలను చెక్ పోస్ట వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వివరాలు ఆరా తీశారు.

ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ చెక్ పోస్ట వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోర్టులోకి అనుమతి ంచాలన్నారు. వాహనాలకు గేట్ పాస్ ఇవ్వడంతో పాటు వివరా లు ఎప్పటికప్పుడు సక్రమంగా రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది షెడ్యూల్ ప్రకారం వారికి కేటాయించిన షిఫ్టలో సమయ పాలన పాటించి విధులకు హాజరు కావాలని జేసీ సిబ్బందిని ఆదేశించారు. ఈ పరిశీలనలో జేసీ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, సీఎస్డీటీలు, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రూ 40 లక్షలు విలువైన 813 కేజీల గంజాయి స్వాధీనం

## వాహనంతో సహా యజమాని అరెస్ట్ మరో ఇద్దరిపై కేసు

### ఉత్తర మండల డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడి



**కోరుకొండ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక) :** గోకవరం పోలీసులు సుమారు 40 లక్షల రూపాయలు విలువైన 813 కేజీల గంగాయి, గంజాయి రవాణా చేస్తున్న వాహనం స్వాధీనం చేసుకుని, వాహన యజమానిని అరెస్టు చేశారు. ఈవిషయమై ఉత్తర మండల డిఎస్పి కే శ్రీనివాసులు, కోరుకొండ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై సత్యకిషోర్, గోకవరం ఎస్సై వి నాగ వెంకట పవన్ కుమార్ సోమవారం సాయంత్రం గోకవరం పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, 23 తేదీ తేదీ ఉదయం 06.00 నుంచి గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకవరం మండలం, కృష్ణునిపాలెం పంచాయతీ, రామన్నపాలెం జంక్షన్ సమీపంలో ఏపీ 31 టీజీ 1625 బొలోరో ట్రక్ వాహనం నిలిపి వేసినారని, అక్కడివారు గమనించి, ఇచ్చిన సమాచారం మేరకు, వెళ్లి చూడగా అక్రమంగా తరలిస్తున్న గంజాయి వాహనాన్ని వదిలేసి నిందితులు పారిపోవడం జరిగిందని గమనించినట్టు తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్, విఆర్ఓ సమక్షంలో 25 ప్లాస్టిక్ గోనె సంచుల్లో ఉన్న సుమారు 813.590 కేజీల గంజాయిని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమో దు చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 40 లక్షల 67 వేల 950 రూపాయలు ఉంటుందని తెలియజేశారు. ఈవిషయమై కేసు నమోదు చేసిన తర్వాత ఈకేసులో ముద్దాయిల ఆచూకీ గురించి దర్యాప్తు సాగిస్తుండగా, సోమవారం ఉదయం బొలెరో వాహనం యొక్క ఓనర్ రామన్న పాలెం జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా ఒక బ్యాగ్ తో తిరుగు తుండగా, అతనిని గమనించి, విచారించగా అల్లూరి సీతారా మరాజు జిల్లాకు చెందిన వంతల జయరాంను అదుపులోకి తీసుకొని, విచారించగా అతని వద్ద బ్యాగులో 10 కేజీల గంజాయి కలిగి ఉన్నట్టు తెలియజేశారు. ఇతనిని కోరుకొండ సీఐ సత్యకిషోర్ విచారించగా, గంజాయి రవాణా అవుతున్న వాహన యజమానిగా తేలిందని డి.ఎస్.పి తెలియజేశారు. దీంతో అతన్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని వెల్లడించారు. ఈకేసులో గంజాయి స్వాధీనం చేసుకున్న వాహన డ్రైవర్ కిల్లో జయరాం, అదేవిధంగా గంజాయి అమ్మిన వ్యక్తి మంగళమాటంలను అరెస్టు చేయవలసి ఉందన్నారు. ఈఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, కేసు దర్యాప్తు జరుగుతుందని తెలియజేశారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీతో పాటు కోరుకొండ సిఐ సత్య కిషోర్, గోకవరం ఎస్సై పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలి

## నిరసనతో పరిహారం చెల్లించిన యాజమాన్యం: సిఐటియు డిమాండ్



**విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** ఫార్మా సిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలన్నీ యాజమాన్యం యొక్క హత్యలే అని, సిఐటియు విశాఖజిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అన్నారు . ఈనెల 22 న రాత్రి పరవాడ ఎస్ఇజెడ్లోని సినర్జిన్ కంపెనీలో రియాక్టర్ పేలి 4గురు కార్మికులు 60 శాతం పైబడి తీవ్రగాయాలతో ఇండస్ హాస్పటల్లో చేరారు. వీరిలో ముగ్గురు జారాండ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, విజయనగరానికి చెందిన సూర్యనారాయణ అనే కార్మికుడు కూడా వున్నారు. వీరిలో ఇప్పటికే జారా?ండ్ చెందిన కార్మికుడు చనిపోగా సూర్యనారాయణ సోమవారం ప్రాణాలు కొల్పోయారు. సూర్య నారాయణకు భార్య సునీత, ఇద్దరు చిన్న పిల్లలు వున్నారు. ఎషాన్షియా ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు చెల్లించిన విధంగానే వీరికి కూడా కోటి రూపాయలు పరిహారం చెల్లించా లని, బాధిత కుటుంబాలకు అన్ని విధాల ఆదుకోవాలని ప్రధాన మంత్రి ప్రకటించిన 2లక్షల రూపాయలు, రాష్ట్రంలో వైసిపి ప్రభు త్వం ప్రకటించిన 5లక్షల రూపాయలు చెల్లించాలని సిఐటియు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈ సందర్భ ంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, అనకా పల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఫార్మా సిటీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణలు మాట్లాడుతూ, ఫార్మా సిటీలో ప్రమాదాలు నిత్యకృత్యమైన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం, భద్రత చర్యలు చేపట్టకపోవడం వలనే ఈ ప్రమాదాలు తరుచూ సంభవిస్తున్నాయన్నారు. సెఫ్టీ ఆడిట్ నిర్వహించక పోవడం ఫ్యాక్టర్సీ ఇన్స్పెక్షన్స్ చేయకపోవడం ఫైర్, పొల్యూషన్ తనిఖీలు లేకపోవడం వలన ఈ ప్రమాదాలు జరుగుతు న్నాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జివో నెం.64ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం ప్రమాదం జరిగినప్పుడు హడవిడిగా ప్రకటనలు చేసి నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటుంది. కానీ తరువాత ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టడం లేదు. భద్రత చర్యలను అమలు చేయని యాజమాన్యాన్ని ఏ విధంగాను శిక్షించటం లేదు. దానితో భద్రతపై యాజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రమాదం జరిగిన కంపెనీల యాజమాన్యాన్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. పరవాడ అచ్యుతపురం, రాంబిల్లి ప్రాంతాల్లో విస్తరంగా ఫార్మా సిటీ కంపెనీలు వున్నా ఒక్క సూపర్ స్పెషాలిట లేకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆ ప్రాంతంలో బర్నస్తో కూడిన సూపర్స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మించాలన్నారు. ఆందోళనకు స్పందించి యాజమాన్యం, అధికారులు వెంటనే రూ కోటి చెక్కును వారి భార్య పేరు మీద ఇవ్వడం జరిగింది. దాహనసంస్కరణలకు 20వేల రూపాయలు సూర్యనారాయణ పార్థివదేహాన్ని విజయనగరం జిల్లా వారి స్వగ్రామానికి తరలించేందుకు అంబులెన్సను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు సిఐటియు జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, పాల్గొన్నారు.

## ఎస్సైను మర్యాదపూర్వకంగా

# కలిసిన జనసైనికులు



**కోరుకొండ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక) :** కోరుకొండ నూతన పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్ ను జనసేన పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచనల మేరకు కోరుకొండ పోలీస్ స్టేషన్లో నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్యాం సుందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేసిన వారిలో కోరుకొండ మండల జనసేన పార్టీ కన్వీనర్ అడ్డాల శ్రీను, జనసేన పార్టీ మండల మాజీ అధ్యక్షులు బదిరెడ్డి దొర, తన్నీరు తాతాజీ, అదేవిధంగా పలువురు కోరుకొండ మండల జనసేన పార్టీ నాయకులు ఉన్నారు.

# కోల్ కత్తా వైద్యురాలిహత్య పై నిరసన



**విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** కోల్ కత్తా లోని జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన పట్ల నిరసన వ్యక్తం చేసారు. జీవీఎంసీ 95 వార్డు పరిధి పురుషోత్తపురంలోని హెచ్ బి కాలనీ కంఫర్ట్ హోమ్స్ నివాసితులు సంఘీభావంగా ఉద్యమించారు. మహిళ వైద్యులకు కల్పించవలసిన రక్షణ చర్యలపై దృష్టి పెట్టాలని... ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, నివాసితులు సంక్షేమ సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు వి రామకృష్ణ, ఎం సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ పార్క్ లో కొవ్వొత్తులతో నివాళులర్పించి అనంతరం రహదారి గుండా ర్యాలీ సాగించారు. ఈ సి సభ్యులు ఎమ్మెస్ శ్రీనివాస్, ఎల్ సూర్య భాస్కర్ ప్రభృతులు వెంట రాగా అసంఖ్యాకంగా చిన్నారులు, మహిళలు, కాలనీ పెద్దలు పాల్గొని అత్యాచారాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తించారు.

# హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఇన్చార్జిగా సూర్యనారాయణ



**కె.కోటపాడు,ఆగస్టు26 (ఆంధ్రపత్రిక):**హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఇన్చార్జిగా మండలంలో మేడిచర్ల గ్రామానికి చెందిన మల్లువలస సూర్యనారాయణను నియమిస్తూ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరినాయుడు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన వంతు సహ కారం అందిస్తానని అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను శక్తి మేరకు అంకితభావంతో నిర్వర్తిస్తానని తెలిపారు.తనకు ఈ బాధ్యతను అప్పగించిన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడుకు, జాతీయ డైరెక్టరుకు సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రంథాలయ నిర్వహణ అభినందనీయం

## కోయిలాడ దశావతారం



**మునగపాక, ఆగస్టు26 (ఆంధ్రపత్రిక):**పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయంలో 13వ వార్షికో త్సవ వేడుకల్లో భాగంగా సోమవారం ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఆటల పోటీలు పిల్లల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొ దిస్తాయని ప్రముఖ సేవ కార్యకర్త దశావతారం అన్నారు. ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ నిర్వాహ కులు అభినందనీయులు అన్నారు. ఈ కార్యకమంలో గౌరవాధ్య క్షులు పెతకంశెట్టి రామజోగినాయుడు, కమిటీ అధ్యక్షులు మళ్ళ జోగినాయుడు, కాంద్రేగుల శ్రీను, పెతకం శెట్టి లీలాభాస్కర్, దాడి గణేష్ , కాంద్రేగు ల రామారావు, కమిటీ సభ్యులు, యువకులు, గ్రామస్తులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





**కోరుకొండ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక) :** సరస్వతి విద్యానికేతన్ శ్రీరంగపట్నంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కరస్పాండెంట్ పెనకటి శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. స్కూలు విద్యార్థిని, విద్యార్థులు శ్రీకృష్ణ, గోపిక వేషధారణలతో చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. ఈసందర్భంగా శ్రీకృష్ణునికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్స్ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం పోసి, కుమారి, లావణ్య, సురేఖ, సరిత, నాగ లక్ష్మి, జగదా, రేవతి, నందిని, వరలక్ష్మి, బేబీ మాధురి, పూజిత, పార్వతి తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అదే విధంగా కోరుకొండ శ్రీ షిరిడీ సాయి స్కూల్ లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ గరగ లక్ష్మీ పద్మావతి ఆధ్వర్యంలో వేడుకలను కన్నులపండువగా జరిగాయి. చిన్నారులు రాధా, కృష్ణుల, గోపికల వేషధారణలతో అలరించారు. ఆనందోత్సాహాల మధ్య ఉట్టి కొట్టి తమ భక్తిని చాటుకున్నారు. సత్యం శ్యామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ హర్ష ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**రౌతులపూడి ,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక) :** మండల కేంద్రమైన రౌతులపూడి శ్రీ హర్ష ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో కృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహి ంచారు, ఈ వేడుకలకు పిల్లలందరూ కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు చిన్నారుల ఆట పాటలతో స్కూల్ మొత్తం సందడి నెలకొంది. దీనిలో భాగంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కూడా ఏర్పా టు చేసి పిల్లల చేత ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు పిల్లలందరికీ చిన్నతనం నుండే సంస్కృతీ సాంప్రదాయాలను అలవర్చి ప్రజలంతా సమానమనే భావన కలుగుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శ్రీ హర్ష ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయుడు కృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జై భారత్ యువజన సేవా సంఘం నూతన కార్యవర్గం

## గంకల కవిత అప్పారావుకు అభినందన



**విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** స్థానిక 48వ వార్డు ఇందిరానగర్ -5 వ ప్రాంతంలో ఆదివారం జై భారత్ యువజన సేవా సంఘం ఎన్నికలు జరిగాయి. విజయం సాధించిన నూతన కార్యవర్గం సభ్యులు 48వ వార్డు కార్పొరేటర్ జీవీఎంసీ భారతీయ జనతా పార్టీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు అధ్యక్షులు రాజాన చిన్నబాబు, సెక్రటరీ కందికుప్ప త్రినాద్, క్యాషియర్ చల్లా లక్ష్మిపతి లను గంకల కవిత అప్పారావుని శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చమ్ అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ జై భారత్ యువజన సేవా సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు కు గంకల కవిత అప్పారావు విశేష కృషి చేసారని కొనియాడారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సంఘాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని, వార్డు అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని జై భారత్ యువజన సేవా సంఘం నూతన కార్యవర్గం సభ్యులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తానని అన్నారు.

# జాతీయ స్థాయిలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**ప్రత్తిపాడు,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** ప్రత్తిపాడు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం బిజెపి మండల కమిటీ సమావేశం జరిగింది. జాతీయ స్థాయిలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పై బిజెపి కార్యకర్తలు నాయకులకు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చిలుకూరి రామ కుమార్ పలు సూచనలు చేశారుప్రత్తిపాడు మండలంలో భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయిలో పటిష్టం చేయాలన్నారు ఈ క్రమంలో భాగంగా మండలంలో 25 వేల మందిని బిజెపి పార్టీలో చేర్చుకుని సభ్యత్వం నమోదు చేయాలన్నారు ఈ మేరకుమండల పార్టీ తీర్మానం చేసింది . ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కందా వీరస్వామి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పంచాయితీ వార్డుల వారీగా తిరిగి కేంద్రంలో బిజెపి పార్టీ రాష్ట్ర ప్రభుత్వానికి నియోజకవర్గాల వారీగా గ్రామ పంచాయతీలకు నేరుగా కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు సద్వినియోగంపై బిజెపి కార్యకర్తలకు అవగాహన కల్పించాలని కూటమి ప్రభుత్వంతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సింగల్ దేవి సత్తిరాజు బిజెపి కన్వీనర్. జిల్లా ఎస్పీ మోర్చ అధ్యక్షులు కించు జోగిరాజు మండల ప్రధాన కార్యదర్శిలు ఇంటి వీరనాగేశ్వరరావు. నక్క శ్రీనివాసు. ఉపాధ్యక్షులు శెట్టి గంగ బాబు. ఊట వీరబాబు. జిల్లా మహిళా మార్చ జనరల్ సెక్రెటరీ ఈర్ల దేవి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కె.జెపురంలో ఘనంగా శ్రీ సత్య సాయిబాబా పల్లకిసేవ



**కె.కోటపాడు,ఆగస్టు26(ఆంధ్రపత్రిక):** అందరూ దైవ కార్యక్రమాల్లో భక్తి,శ్రద్దలతో పాల్గొని ఆ దేవుని అనుగ్రహం పొందాలని శ్రీ సత్య సాయిసేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. భగవాన్ శ్రీ సత్య సాయిబాబావారి 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి మండలంలోని కె.జె.పురంలో స్వామివారి పల్లకి సేవ మహోత్సవంగా భక్తి,శ్రద్దలతో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అయన మాట్లాడుతూ నిత్యం భగవన్నామ సంకీర్తన చేయాలన్నారు..ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితుడుగా పాల్గొన్న శ్రీ సత్య సాయిసేవా సంస్థల విశాఖపట్నం జిల్లా విద్యా విభాగం సమన్వ యకర్త బగ్గం సతీష్ మాట్లాడుతూ రామ సేవ-గ్రామ సేవ విశిష్టత గురించి వివరిం చారు. గ్రామ శ్రీ సత్యసాయి భజన మండలి కన్వీనరు చంద్ర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెందుర్తి పల్లకి నాయుడు బృందం, కె.కోటపాడు సమితి కన్వీనరు బండారు నారాయణ పాత్రుడు, కన్వీనర్లు, బాలవికాస్ గురువులు,భక్తులుచల్లా సన్యాసినాయుడు (తులసి), రాంబాబు, అప్పలస్వామి, రామకృష్ణ, రాము, ఎర్రినాయుడు, సత్యనారా యణ, యద్ల అప్పలనాయుడు, లక్ష్మి, అర్జునమ్మ, గంగునాయుడు, యద్ల లక్ష్మి, కుమారి, చిన్నతల్లి, హారిక, దేముడమ్మ, గంగాధర్, పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు



**కె.కోటపాడు, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ కృష్ణాష్ట మి వేడుకగా జరిగింది. శ్రీకృష్ణుని ఆలయాల్లో ఉదయం నుంచి భక్తు లు శ్రీ కృష్ణ భగవానుడిని దర్శించుకున్నారు. చౌడువాడ, సూదివలస గ్రామాల్లో జరిగిన శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో మాడుగుల శాసన సభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.శ్రీ కృష్ణ భగవాడిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తిని ఉత్సవ నిర్వాహకులు సన్మానం చేశారు. ఎమ్మెల్యే బండారుతో పాటు తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం నాయకుడు పైలా ప్రసాదరావు, మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి మహేష్, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సబ్బవరపు రామునాయుడు, క్లస్టర్ ఇంచార్జి కన్నూరు సూర్యనారాయణ, నాయకులు బండారు నరసింహనాయుడు, మండల జనసేనపార్టీ అధ్యక్షుడు బాలిబోయిన సంతోష్, ప్రధాన కార్యదర్శి కుంచా అంజిబాబు, జనసేన వీర మహిళా జిల్లా నాయకురాలు అనిమిరెడ్డి వెంకట లక్ష్మీ, మాజీ సర్పంచ్ యాళ్ల సింహాచలంనాయుడు, టీడీపీ నాయకులు యాళ్ళ నాయుడు(జె.సి.బి.నాయుడు), మొల్లి గంగునాయుడు, జనసేన నాయకుడు బంధం రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మదర్ తెరిసా జయంతి




**అనకాపల్లి, ఆగస్ట్ 26 (ఆంధ్రపత్రిక):** మదర్ తెరిసా 115 వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రావులమ్మ మాట్లాడుతూ, మదర్ తెరిసా స్కోప్లే మెసిడోనియాలో 1910 ఆగస్టు 26వ తేదీన జన్మించారన్నారు. ఈమె పేరు ఆగ్నేస్ గోక్ష బొజాక్షు ఈమె రోమన్ క్యాథలిక్ మిషనరీకి చెందిన మేరీ తెరిసా సిస్టర్గా ఉంటుండగా ఈమె అనాధ పిల్లలను పేదవారిని దత్తత తీసుకొని ప్రపంచ దేశాలు ముక్కున వేలేసుకునేలా చేసినటువంటి సేవ అమోఘమైనది. ప్రేమతో ఈమె చేసినటువంటి సేవకు గాను ఈమెకు నోబెల్ శాంతి. భారతరత్న. అప్పటి 23వ పోపు శాంతి ప్రైజ్ అనేటటువంటి అవార్డులతో సత్కరించారు. అలాగే మదర్ తెరిసా భారతదేశంలో పౌరసత్వం పొంది మిషనరీ ఆఫ్ చారిటీస్ ని భారత దేశంలో కలకత్తాలో స్థాపించారన్నారు. 1970 నాటికి మానవతావాదిగా, పేద ప్రజలు, నిస్సహాయులకు అనుకూలురాలిగా అంతర్జాతీయ కీర్తి పొందారన్నారు.ఎంతోమంది మహానుభావులను కన్నటువంటి భారతదేశము ఎంతో గొప్పది. ఇలాంటి మహానుభావుల్ని వాళ్ళు పుట్టినరోజు సందర్భముగా స్మరించుకోవడం మనమందరము చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ బల్ల.నాగభూషణం తదితర సభ్యులకి అందరికీ ఎస్సై రాములమ్మ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు



**అనకాపల్లి,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** పట్టణంలో వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గోకులాన్ని తలపించే అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిట్టి పొట్టి చిన్నారులంతా బుడిబుడి నడకలతో రాధాకృష్ణ వేషధారులై పాఠశాలకు విచ్చేసి చూపరులను విశేషంగా ఆకర్షించారు. ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు అన్నట్టు తల్లిదండ్రులు తమ చిన్నారుల వేషధారణను చూసి ఆనంద పరవశులయ్యారు. కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉట్టి ఉత్సవంలో చిన్నారులు పాల్గొని ఉత్సాహంగా ఉట్టిని కొట్టేందుకు పోటీపడ్డారు. గోకులంలో ఆటపాటలతో సందడిగా గడిచిన శ్రీకృష్ణ బాల్య కర్ణామృతా న్ని కథల రూపేనా చిన్నారులకు గిరీష్ కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విశ్రాంత ఏఈ మల్ల చిన్నారావు, ఇరుగు పొరుగు వారు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## ఎన్నేళ్ళు ఈ రహదారి కష్టాలు?



### అభివృద్ధికి నోచుకోని దొగ్గపేట-నర్సంపేట రోడ్డు.. మీరైనా పట్టించుకోండి అంటూ ఎమ్మెల్యే కోళ్ళకు విజ్ఞప్తి

**వేపాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** ప్రభుత్వాలు పాలకులు మారారు. అక్కడి ప్రజల తలరాతలు గాని,ఆయా గ్రామాల రహదారి దుస్థితి గాని ఏమాత్రం మారలేదు. ఎన్నికలపుడు హామీలు ఇస్తారు.తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోరు.మండలంలోని కుమ్మపల్లి శివారు దొగ్గపేట నుంచి ఎల్.కోట మండలం నర్సంపేట గ్రామాల మధ్య గల దూరం కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే. కానీ ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు దశాబ్ధాల తరబడి నేతలకు తీరిక లేదు. దాంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందు కు నిత్యం నరకం చూస్తున్నారు. గత వైసీపీ ప్రభు త్వ హయాంలో మెటల్ రోడ్డు వేసి తారు నిర్మాణం రోడ్డు మరిచారు. ఇపుడు టీడీపీ అధికారంలోకి రావడంతో మీరైనా పట్టించుకోండి అంటూ ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుత ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని వేడుకుంటూ విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే కోళ్ల రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసేందుకు ఎస్టిమేషన్ వేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం ఉంది.

# మండలంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### అన్నసమారాధనలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

### కే.ఆర్ పేటలో అలరించిన చిన్నారుల బండ్ల వేషాలు



**వేపాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** మండలంలోని కుమ్మపల్లి, కృష్ణారాయుడు పేట, చినగుడిపాల, వేపాడ, వావిలపాడు, రామస్వామిపేట, బక్కునాయుడు పేట తదితర గ్రామాలలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుమ్మపల్లి, కేఆర్ పేట, చినగుడిపాల గ్రామాలతో పాటు పలు గ్రామాలలో భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేయగా భక్తులు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. అలాగే కుమ్మపల్లిలో రాత్రి 7గంటల నుంచి వెంకట రమణమూర్తి పాటను ఏర్పాటు చేయగా, కేఆర్ పేటలో కృష్ణుడి ఊరేగింపు, కృష్ణుడి వేషాలతో చిన్నారుల వేషధారణలు, ఉట్టి కొట్టడం, చినగుడిపాలలో కృష్ణుడి ఊరేగింపు డిజే వాయిద్యాలు, బ్యాండు మేళాలతో జనరంజకంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచ్లు మాజీ సర్పంచ్లు చెల్లుబోని బాల బాబు, అల్లబోని పైడిబాబు, బోజంకి రామునాయుడు, కోన గంగునాయుడు,రమ, వేచలపు చంద్రరావు, అనుదంపతులు, శ్రీ కృష్ణా యాదవ సంఘం సభ్యులు బొబ్బిలి సన్యాసి నాయుడు, తోనంగి శ్రీను,కోన ఈశ్వరరావు,లండ అప్పన్న,గొలగాని కృష్ణమూర్తి, మంగరాజు,ఇతర పెద్దలు ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక సదస్సును విజయవంతం చేయాలి

### కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** ఈ నెల 29న జరగనున్న ఆర్థిక వ్యవస్థ-అమలు విధానం సదస్సు ను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం నొవాటెల్లో జరగనున్న సదస్సు ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, ఆర్డిఓ డి.హుస్సేన్ సాహెబ్లతో కలిసి సోమ వారం కలెక్టర్ పరిశీలించారు. హోటల్లోని పరిస్థితులను గమనించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. సదస్సుకు పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, ప్రతినిధులు, ఉన్నతాధికారులు విచ్చేస్తున్నందున ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదని అధికారులను ఆదేశించారు. అలాగే వారికి కేటాయించే వసతి, భోజనం, రవాణా సదుపాయాలు పక్కాగా ఉండాలని తెలిపారు. సదస్సు ముందు రోజు నుంచి సదస్సు ముగిసే వరకు ఎక్కడా ఏ సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, వైద్య తదితర విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, ఆర్డిఓ డి.హుస్సేన్ సాహెబ్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేపాడలో ఘనంగా శ్రీకృష్ణ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

### భక్తి పరవశంగా వెంకటరమణమూర్తి పాట. ఆకట్టుకున్న శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారుల ఉట్టి కొట్టు కార్యక్రమం



**వేపాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** మండల కేంద్రం వేపాడలో శ్రీకృష్ణ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువజాము నుండి శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా శ్రీశ్రీశ్రీ రుక్మిణి సత్యభామ సమేత గోపాలకృష్ణ ఆలయలో ప్రత్యేక పూజా,అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం సాయంత్రం 6 గంటలకు ఏర్పాటుచేసిన ఉట్టి కొట్టుట కార్యక్రమంలో 10సంవత్సరాల లోపు చిన్నారులు ఉట్టిని కొట్టి బహుమతులను గెలుచుకున్నారు. అనంతరం రాత్రి 8గంటలకు యాదవ సంఘం సభ్యులు ఏర్పాటుచేసిన వెంకటరమణమూర్తి పాట భక్తి పరవశంగా తిలకించారు.ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవమునకు అలంకరణ,పూజా సామాగ్రితో పాటు పట్టు వస్త్రాలను గ్రామానికి చెందిన చీపురుపల్లి నాయుడు బాబు రామకృష్ణమ్మ దంపతులు, ఈగల అప్పారావు చిన్నతల్లి దంపతులు సమకూర్చారు. అదే విధంగా మరుసటి రోజు 27వ తారీకున ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 8గంటల నుండి గోపా జోష్యుల సాయిరాం శర్మ ఆధ్వర్యంలో కళ్యాణం జరుపబడుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన గుమ్మడి సింహాచలం జ్ఞాపకార్థం వారి కుమారుడు నరసింహామూర్తి, భారతి దంపుతుల ఆర్థిక సహాయంతో వేచలపు అగ్రహారం వారిచే సన్నాయి మేళం కార్యక్రమం నిర్వహించబడుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.అదే రోజు మధ్యాహ్నం 12గంటల నుంచి భారీ అన్న సమారాధన నిర్వహించబడుతుందని, అన్న సమారాధన కార్యక్రమంలో వేపాడ, వల్లంపూడి గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కమిటీ సభ్యులు కోరారు.

## అర్.వై.అగ్రహారంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి



**కె.కోటపాడు, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని రామయోగిఅగ్రహారం గ్రామంలో సోమవారం శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. బిజెపి సీనియర్ నాయకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి) మాజీ డైరెక్టరు చల్లా సత్యనారాయణ మూర్తి శకుంతల దంపతులు శ్రీ వేణుగోపాల స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఈ అన్న, సమారాధనలో రామయోగి అగ్రహారం గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న, ప్రసాదాలు స్వీకరించారు.

## దైవజనులందరికీ ప్రియమైన దేవుడు యేసు క్రీస్తు

### నియోజకవర్గ క్రిష్టియన్ మైనారిటీ అధ్యక్షులు ఫాస్టర్ ఫిలిప్ డేవిడ్



**వేపాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** దైవజనులకు యేసుప్రభువే ప్రియమైన దేవుడని నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు ఫాస్టర్ జి.ఫిలిప్ డేవిడ్ అన్నారు.నియోజకవర్గంలోని ఎల్.కోట మండలం గోల్డ్ స్టార్ జంక్షన్లో గల పాల్ మెమోరియల్ చర్చిలో సోమవారం ఎల్.కోట మండలం ఫెలోషిప్ 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఎల్.కోట ఫెలోషిప్ అధ్యక్షులు ఫాస్టర్ దేవప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫాస్టర్ ఫిలిప్ డేవిడ్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన శుభసందర్భంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఫాస్టర్ ఫిలిప్ డేవిడ్ మాట్లడుతూ యేసుక్రీస్తు ఆశీస్సులతో,దైవజనుల అభిమానంతో నన్ను క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షులుగా ఎన్నుకున్న నేపథ్యంలో అందరి సంక్షేమం కోసం నిరంతరం పాటు పడతానన్నారు.ఇంతటి ఘన సన్మానం చేసిన దైవ జనులు,అభిమాన ఫాస్టర్లు అందరికీ ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో ఫాస్టర్ డేనియల్,బిషప్ పి.స్టీఫెన్ ప్రసాద్, బిషప్ తవై. బెంజిమెన్,ఫాస్టర్ సాలెం రాజు,తదితరులు పాల్గొనగా పలువురు ఫాస్టరమ్మలకు చీరలు పంపిణీ చేశారు.

## అక్రమంగా లారీలో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

### ఇద్దరు నిందితులు అరెస్ట్

### 912 కేజీలు, 65 లక్షలు విలువగల గంజాయి సీజ్



**అనకాపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా మార్గాలపై ప్రత్యే నిఘ ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ ఎం. దీపిక అన్నారు సోమవారం ఎస్పీ కార్యాలయంలో స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సబ్బవరం మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో సమాచారం మేరకు ఎస్సై ఆర్ ధనుంజయ్ సిబ్బందితో సబ్బవరం నుండి కొత్తవలస వెళ్లే ఆర్ అండ్ బి తారు రోడ్డు గుల్లేపల్లి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా లారీలో 912 కేజీలు గంజాయి సుమారు 46 లక్షల విలువగల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డరన్నారు బారావత్ తరుణ్ చేతి మల్లేశ్వరరావు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయమన్నారు. మరో ఐదుగురు నిందితులు పరార్లో ఉన్నారని వారిని త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు వీరిని పట్టుకోవడం కోసం మూడు టీములను పంపించడం జరిగిందన్నారు 450 గోధుమ కలర్ ప్యాకెట్లలో ఉన్న గంజాయిని లారీ క్యాబిన్లోని రహస్య ఆరాళ్లలో పెట్టి అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు కనకదుర్గ లారీ సర్వీసెస్ చెందిన ఏపీ 31 47 89 నెంబర్ గల లారీలో గంజాయి తరలించేందుకు ప్రత్యేక అరలు తయారు చేయించి డ్రైవర్ కేబిన్ లోని డ్రైవర్ సీటు వెనక భాగంలో డ్రైవర్ సీట్పై భాగంలో గంజాయి ప్యాకెట్లను లారీల్లో రహస్య అరాలలో గంజాయి అమర్చి పెట్టారు 9 12 కేజీలు గంజాయి 10 లక్షలు విలువ గల ఒక లారీ నాలుగు మొబైల్ ఫోన్లు 15 వేల రూపాయలు క్యాష్ మధ్య వర్తులు సమక్షంలో సబ్బవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం 100 రోజులు గంజాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర డిజిపి ద్వారకాతిరుమలరావు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు స్టాక్ చెక్ పోస్టలు డైనమిక్ చెక్ పోస్టలను ఏర్పాటు చేసి వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్బిడిఎస్పిబి అప్పారావు పరవాడ సబ్ డివిజన్ డిఎస్పి కెవివి.సత్యనారాయణ సబ్బవరం ఇన్స్పెక్టర్ పిన్నింటి రమణ ఎస్సై ధనుంజయ్ పోలీస్ స్టేషన్లో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ అధికారులను సిబ్బందిని అభినందించి నగదు అవార్డులను అందజేశారు.

## పర్యావరణం పరిరక్షణ, వృక్షో రక్షితీః రక్షితః

### స్మశాన వాకిట్లో ఫలసాయం మొక్కలు



**అనకాపల్లి. ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** 84వ వార్డు జీవీఎంసీ కొత్తూరు నర్సింగరావుపేట స్మశాన వాటిక ప్రహరీ గోడ లోపల సోమవారం నాడు మొక్కలు నాటే కార్యక్రమం ఆ గ్రామం కూటమి ప్రభుత్వం నాయకులు,గ్రామ ప్రజలు, ప్రారంభించామని 84వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాదంశెట్టి నీలాబాబు తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింతామణి గణపతి దత్త క్షేత్రంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆంజనేయ రాజు, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో ఫల సాయం వచ్చే మొక్కలను గ్రామానికి సహాయంగా అందించారు. స్థానిక కార్పొరేటర్ మాదం శెట్టి చిన్న తల్లి,నీల బాబు, స్మశానవాకిటికి చేరుకొని, స్థానిక ప్రజలతో కలిసి ఒక్కొక్కరితో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారని నీలాబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయ రాజు, నీలాబాబు, ఇరువురు మాట్లాడుతూ ఈ మొక్కలు కొబ్బరి, మామిడి, నేరేడు, వేప, నిద్ర గన్నేరు, మొక్కలను వేయిస్తూ,రానున్న భవిష్యత్ తరాలలో అందరికీ ఉపయోగార్థం,పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, వాటి నుంచి వచ్చే ఫల సాయం అందే విధంగా స్థానిక ప్రజలు ఏర్పాటు వీటి పెరుగుదలకు కృషి చేయాలని, ప్రతి గ్రామాలలో,పల్లెల్లో ఈ మొక్కలు నాటే కార్యక్రమం యువత చేపట్టాలని వృక్షో రక్షతి రక్షితః అని పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, చేబోలు దుర్గ ప్రసాద్, బల్లిన నాగు, వీరేశ్వరపు రాంప్రసాద్, కసిరెడ్డి అప్పలకొండ, సిరసపల్లి ప్రసాద్, మేడిశెట్టి ప్రకాష్, కరెట్ల కుమార్, గల్లా శివ, గొల్లవిల్లి సత్తి, గొల్లవిల్లి మణికంఠ, వీరశ్వరపు పెంటరావు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా టూరిజం అభివృద్ధి చేస్తాం

## పిచ్చుకలంక పర్యాటక రంగ అభివృద్ధిపై ఒబెరాయ్ ప్రతినిధులతో చర్చించిన మంత్రి కందుల దుర్గేష్







**కోనసీమ ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** సహజ సిద్ధ ప్రకృతి రమణీయత గల ప్రాంతంగా విరాజిల్లుతున్న పిచ్చుకలంక లో పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఒబెరాయ్ ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పర్యాటక రంగ అంశాలపై సమీక్షించడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవా రం ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో పర్యాటక రంగ అభివృద్ధిపై ఒబెరాయ్ ప్రతినిధులతో క్షేత్ర స్థాయిలో పర్య టించి పర్యాటక రంగ అంశాలపై మంత్రి కందుల దుర్గేష్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చి చౌదరి, ఒబెరాయ్ హొటల్స్ ప్రతినిధులు ఆర్ శంకర్, నవీన్ గోస్వా మి, మాలూన్ తానేజ్ పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఓబెరా య్ హొటల్స్ ప్రతినిధులు పిచ్చుకలంక గ్రామాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలకు రావడం జరిగిందన్నారు. ఆ సందర్భంలో రాజమండ్రి వద్ద పిచ్చుకలంక గ్రామం లో పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రకృతి సంపద ఉందని ఈ ప్రాంతాన్ని కూడా పరిగణనలోనికి తీసుకోవాలని వారికి చెప్పడం జరిగిందన్నారు. ఆ మేరకు ఓబెరాయ్ హొటల్స్ ప్రతినిధి బృందం నేడు పిచ్చుకల్లంక గ్రామాన్ని సందర్శించడం జరిగిందని పేర్కొన్నా రు. ఈ సందర్భంగా ఓబెరాయ్ హొటల్స్ ప్రతినిధి బృందానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పిచ్చుకల్లంక పర్యాటక ప్రాంతం అభివృద్ధిపై శాసనసభ్యులు గోరంట్ల బుచ్చి చౌదరి, బండారు సత్యానందం, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వివరించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో పెద్ద స్థాయిలో రిసార్ట్స్ నిర్మించి టూరిజాన్ని అభివృద్ధి చేస్తే ఉభయ గోదావరి జిల్లాలోని దేవాలయాలు వచ్చే యాత్రికులు అన్నవరం సత్యనారాయణ స్వామి, సామర్లకోట భీమేశ్వరస్వామి, ధవళేశ్వరంలో లక్ష్మి జనార్ధన స్వామి, అంతర్వేది, కోరుకొండలలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానా లు టెంపుల్ టూరిజంగా ఉన్నాయని పేర్కొన్నారు. మారేడుమిల్లి వంటి ప్రాంతంలో పర్యావరణానికి హితమైన ఇకో టూరిజం, రాజమహేంద్రవరంలో గోదావరి తీరం, డా. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కేరళను తలపించే విధంగా ప్రకృతి అందాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకు ండా పర్యాటకులను ఆకర్షించే విధంగా టూరిజాన్ని అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతాన్ని సందర్శించే పర్యాట కులు కేవలం ఒక్కరోజు మాత్రమే కాకుండా రెండు మూడు రోజులు ఉండే విధంగా గోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలను పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. కడియం నర్సరీ ఆసియాలోనే ద్వితీయ స్థానాన్ని ఏర్పరచుకుందని, దాన్ని అభివృద్ధి చేసే దిశగా కెనాల్ బోట్ షికార్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. అధికారులు గ్రూప్ సభ్యులు కోరిన సమాచారాన్ని సంపూర్ణంగా విపులంగా వివరిస్తూ వ్రాతపతులను సమర్పించారన్నారు. అదేవిధంగా ఛాయాచిత్ర ప్రదర్శన మ్యాపులు ద్వారా సభ్యులకు ఈ ప్రాంత భౌగోళిక స్థితిగతులు వరద సమయాలలో ఏ స్థాయిలో వరద ప్రవహిస్తుందన్న అంశాలపై కూడా అవగాహన పెంపొందించామన్నారు. స్థానిక శాసనస భ్యులు బండారు సత్యానందరావు మాట్లాడుతూ పిచ్చుక లంక ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిది ద్దేందుకు గ్రూప్ సభ్యులు క్షేత్ర పరిశీలనకురావడం అభినందనీయమన్నారు పర్యాటక హబ్ ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దేం దుకు అవకాశాలు నిండుగా ఉన్నాయని తెలిపారు. ఔషధ మొక్కలు పెంపకానికి ఈ ప్రాంతం ఎంతో అనువై నదని అదేవిధంగా ఆహ్లాద కర వాతావరణం లో బోటి షికారు నిర్వహించడానికి అనువుగా ఉంటుందన్నారు. కేరళకు మించిన అందాలు కోనసీమ లో ఉన్నా యని తెలిపారు. మంచి ఎంటర్టైన్మెంట్ అవకాశం స్థానిక ప్రజానీ కానికి పిచ్చుకలంక ప్రాంత అభివృద్ధి ద్వారా లభించనున్న దన్నారు అన్ని అవకాశాలను మేళవించి మంచి టూరిజం ప్యాకేజీ ను తీసు కురావాలని ఆయన గ్రూప్ సభ్యులకు విన్నవించారు. శాసనస భ్య లు గోరంట్ల బుచ్చ య్య చౌదరి మాట్లాడుతూ పర్యాటక రంగ అభి వృద్ధి మూలంగా స్థానికంగా ఉన్న యువతకు ప్రత్యక్షం గా పరోక్ష ంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడ నున్నాయన్నారు. పిచ్చుకలం క సుందరమైన ప్రాంతమని తెలిపారు. రాజమహేం ద్రవరంలో హేవలాకు బ్రిడ్జిని పర్యాటక ప్రాంతంగా చర్యలు చేపట్టామని తెలిపారు. పర్యాటక ప్రాజెక్టుల వల్ల పర్యాటక రంగ అభివృద్ధితో పాటుగా ఇతర ఉత్పాదక కార్యకలాపాల అభివృద్ధికి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓబరాయి గ్రూపు వైస్ చైర్మన్ ఆర్ శంకర్, నవీన్ గోస్వామి తినేజ, పర్యాటక శాఖ ప్రాంతీ య సంచాలకులు వి. స్వామి నాయుడు, జిల్లా పర్యాటక అభివృద్ధి కారి పి.వెంకటాచలం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి ఎస్ వి వి సత్యనారాయణ, స్థానిక నాయకులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలకుపాల్పడితే కఠిన చర్యలు

## పేకాట శిబిరంపై దాడి 14 మంది అరెస్ట్: ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు



**వేటపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** పేకాట, జూదం, సింగిల్ నెంబర్ వంటి అసాంఘిక కార్యక్ర మాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని వేటపాలెం ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం మండలంలోని కటారి పాలెం గ్రామంలో పేకాట శిబిరం నిర్వహి స్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి 14 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జూదరుల వద్ద నుండి రూ 11,100/- స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహించిన లేక పాల్గొన్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# విద్యుత్ ఘాటంతో ఇళ్ళు కోల్పోయిన బాధితులకు పక్కా ఇల్లు నిర్మిస్తాం



**బాపట్ల ,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** బాపట్ల నియోజకవర్గ పరిధి కర్లపాలెం మండలంలో లంక కాలువ కట్టమీద ఉన్న తొమ్మిది ఎస్టీ గృహాలు కరెంటు షార్టు సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధమై పోయాయి. విష యం తెలుసుకున్న బాపట్ల జిల్లా కలెక్టర్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటన జరిగినప్పుడు బాధితులు కూలి పనులకు వెళ్లి ఉన్నందువలన ఘటనస్థలిలో ఎవరు లేరని బాధితులు తెలిపారు. ప్రాణ నష్టం జరగ లేదు. కలెక్టర్ బాధితులకు నిత్యవసర వస్తువులు భోజన ఏర్పాట్లు చేసి ప్రతి కుటుంబానికి రూ 5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరిగింది. కలెక్టర్ ఈ విషయాన్ని వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి 40 వేల రూపాయలు వచ్చే విధంగా ఆర్థిక సహాయం అందిస్తామని, ప్రభుత్వం తరపున నాలుగు లక్షల రూపాయలతో మౌలిక సదుపాయాలతో కూడిన పక్కా ఇల్లు నిర్మించి అంద చేస్తామని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట బాపట్ల జాయింట్ కలెక్టర్ బి సుబ్బారావు గారు కర్ల పాలెం ఎమ్మార్వో,ఎస్సై లు ఉన్నారు.

# పండుగల పరమార్థం సేవను ప్రోత్సహించడమే

## తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు , ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** సమాజంలో పరస్పర సంబంధాలు మెరుగుపరుచుకుంటూ పదిమంది ప్రయోజనం కోసం పాటుపడాలనే సందేశమే పండగల పరమార్థమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల సందర్భంగా సోమవారం పాత గుంటూరు లోని పలుచోట్ల నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ ఉత్స వాల్లో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక పూజలు చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు కృష్ణా ష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ కృష్ణుడి కృప మనందరిపై ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, మీరావలి, కూరాకుల ప్రభాకర్, కందుకూరి వెంకట్, చావల శీను, ఎల్లవల్లి వీర రాజు, అల్లం బాజీ, సుబ్బారావు, రియాజ్, మహంకాళి నరసింహారావు, కుర్ర పున్నారావు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెల్టు షాపుల నిర్వహిస్తే కఠిన చర్యలు

## ఎస్ ఈ బి ఎస్ఐ సైమన్



**అద్దంకి, ఆగస్టు26( ఆంధ్రపత్రిక):** సోమవారం స్థానిక ఎస్ ఈ బి కార్యాలయము నందు ఎస్సై వీరవల్లి సైమన్ మాట్లాడుతూ గ్రామాలలో పట్టణంలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు ప్రభుత్వ దుకాణమునందే మద్యాన్ని విక్రయించాలని అక్రమంగా మధ్యాన్ని బెల్టు షాపుల నందు అమ్మడం చట్టరీత్యా నేరం అని అన్నారు ఈ బెల్టు షాపుల తొలగింపుకు ప్రత్యేక క్షేత్రస్థాయి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు వీనితోపాటు ఇసుక అక్రమ తవ్వకాలు రవాణాపై ఉక్కు పాదం మోపాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అద్దంకి డివిజన్ స్థాయిలో గుండ్లకమ్మ తీర ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా వెంపరాల రేవు నుండి మణికేశ్వరం వరకు క్షేత్రస్థాయిలో వివిధ శాఖల సమన్వయంతో అధికారులను ఏర్పాటు చేశామన్నారు ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే యంత్రాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు అంతేకాకుండా గంజాయి పేకాట కోడి పందాలు నిర్వహించడం చట్ట రీత్య నేరమని వాటిని నిర్వహిస్తే కఠినంగా శిక్షిస్తామని అన్నారు ముఖ్యంగా యువత విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బంగారం భవిష్యత్తు నిర్మించుకోవాలని కోరారు 'సేబ్ కార్యాలయానికి సిబ్బంది కొరత'బెల్ట్ షాపులు ఇసుక అక్రమ రవాణా గంజాయి పేకాట కోడి పందాలు మొదలైనవి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి నేరాల జరగకుండా చూడాలని అన్నారు మా కార్యాలయ పరిధి అద్దంకి నియోజకవర్గం లోని ఐదు మండలాలు కానీ కార్యాలయానికి కేటాయించిన ఇచ్చిన సిబ్బంది ఒకరు సీఐ ఇద్దరు ఎస్ఐలు హెడ్ కానిస్టేబుల్ ముగ్గురు 12 మంది కానిస్టేబుల్స్ ఉండాలన్నారు ప్రస్తుతం ఎస్ఐ ఒకరు ఆరుగురు కానిస్టేబుల్ తో మాత్రమే కార్యకలాపాల నిర్వహిస్తున్నామన్నారు ఈ అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయాలంటే సరిపడ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుచున్నారు.

# సిద్ధాంత ప్రాతిపదికన బిజేపి పార్టీ సభ్యత్వ నమోదు సామాన్య కార్యకరకు అత్యున్నత స్థానం



**గుంటూరు , ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** బిజెపి సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నాలుగో మండలంలోని అరండల్ పేటలోని రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్ నివాస ప్రాంగణంలో మండల అధ్యక్షులు పెమ్మరాజు సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రకుమార్ మాట్లాడుతూ సిద్ధాంత ప్రాతిపదికన సభ్యత్వ నమోదు చేసే పార్టీ బిజెపి అని సామాన్య కార్యకర్తకు అత్యున్నత స్థాయి కల్పించిన ఉన్నత ఆశయాలు విలువలు కలిగిన ఏకైక పార్టీగా బిజెపిఅని అభివర్ణించారు. సభ్యత్వ నమోదు జిల్లా ప్రముఖ్ పాలపాటి రవికుమార్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదును మూడు విధాలుగా చేసుకోవచ్చని మొదటి విధానం మిస్డ్ కాల్ రెండో విధానం నమో యాప్ మూడో విధానం క్యూ ఆర్ కోడ్ ల ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు సభ్యత్వ నమోదుకు మిస్డ్ కాల్ నెంబర్ గా 8800002024 ను కేంద్ర పార్టీ కేటాయించిందని తెలిపారు సెప్టెంబరు ఒకటిన భారత ప్రధాని నరేంద్రమోది బిజెపి జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ద్వారా సభ్యత్వం తీసుకుంటారని సెప్టెంబర్ 2న రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సభ్యత్వం తీసుకుంటారని అనంతరం రాష్ట్రవ్యాప్తంగా సభ్యత నమోదు కార్యక్రమం అధికారికంగా ప్రారంభం అవుతుందని తెలిపారు. బిజెపి సభ్యత నమోదును ఒక ఛాలెంజ్ గా తీసుకొని మండల కార్యవర్గ సభ్యులు శక్తి కేంద్ర ఇన్చార్జిలు బూతు కమిటీల అధ్యక్షులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మండల సభ్యత్వ నమోదు ప్రముఖ్ పెద్దింటి శ్రీకృష్ణ చైతన్య, సహ ప్రముఖ్ లు మండలపు సురేష్ చౌదరి, పద్మనాభుని రమాదేవి క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. మండల అధ్యక్షులు పేమ్మరాజు సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పశ్చిమ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రముఖ్ చెరుకూరి తిరుపతిరావు జిల్లా ఉపాధ్యక్షురాలు బండ్లమూడి సుగుణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్ మండల ప్రధాన కార్యదర్శి మంచాల అశోక్ నాగసాయి, కార్యదర్శులు వక్కలగడ్డ తిరుమలరావు, సీనియర్ బిజెపి నాయకులు బజరంగ్ రామకృష్ణ, మాజేటి మనోహర్, కేసనపల్లి శ్రీరామ్, కేసన్ శెట్టి చంద్రశేఖర్, శేషసాయి, జితేంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఉమాశంకర్ అబ్దుల్ కలాం జాతీయ సేవా పురస్కారం



**పొన్నూరు,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** పొన్నూరు పట్టణంలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ రక్తదాన అన్నదాన మన పొన్నూరు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల శెట్టి ఉమాశంకర్ కార్యవర్గ సభ్యులు చిలకపాటి సింహాద్రి కు అబ్దుల్ కలాం జాతీయ సేవా పురస్కారం దక్కింది. విజయవాడకు చెందిన మదర్ సర్వీసెస్ సొసైటీ రెండో వార్షికోత్సవ సందర్భంగా సోమవారం అక్కినేని నాగేశ్వరరావు కళా కేంద్రంలో జాతీయ సేవ పురస్కారం సంస్థ అధ్యక్షులు మల్లాది ప్రసాద్ రావు చేతులమీదుగా అవార్డు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఈరోజు మేము అందుకున్న ఈ జాతీయ సేవా పురస్కారం అనేది తోడ్పాటు అందించిన ప్రతి ఒక్క సేవ బృందంలోని సభ్యుడి కి మా రక్తదాతలకు అన్నదాతలకు సభ్యులకు చెందుతుందని తెలుపుతూ, అలాగే ఈ సేవ పురస్కారం తమ మీద సమాజం గురించి మరింత బాధ్యతలను పెంచుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా తన సేవలు గుర్తించిన విజయవాడ మదర్ సర్వీస్ సొసైటీ సభ్యులకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు




**అద్దంకి ,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** సోమవారం సింగరకొండ వద్ద గల ఇండోర్ స్టేడియం నందు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాలలో భాగంగా డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగినది. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పునాటి హరిబాబు ఆడిట్ కమిటీ కన్వీనర్ జగ న్నాథం బాబురావు ఈ ఆటల పోటీలను ప్రారంభించారు హరి బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల కొరకు పోరాటాలు చేయడమే కాకుండా సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలలో ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేయడం కొరకు స్వర్ణోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు ఈ ఆటల్లో గెలుపొందిన ఉపాధ్యా యులకు సెప్టెంబర్ ఒకటో తేదీన బాపట్ల నందు జిల్లాస్థాయి లో జరిగే పోటీల్లో పాల్గొంటారని అనంతరం గుంటూరులో రాష్ట్ర స్థాయిలో జరిగే ఆటల పోటీల్లో పాల్గొనవచ్చు అని తెలిపారు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బేతాళ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ స్వర్ణోత్సవములో భాగంగా ఉపాధ్యాయులకు సృజనాత్మక కొరకు ఆటలు పాటలు సామాజిక ఉల్లాసం కొరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

అధ్యక్షులు రామా రావు మాట్లాడుతూ సమాజం పట్ల అంకిత భావంతో పనిచేసే ఏకైక ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అని అన్నారు షటిల్ క్రికెట్ వాలీబాల్ క్యారమ్స్ రన్నింగ్ చెస్ కబాడీ వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గంగాధర్,శ్రీనివాసరావు హనుమంతరావు రామాంజనేయులు రాజశేఖర్ బ్రాహ్మజీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు .

# క్రీస్తు ప్రేమను క్రియల్లో చూపించిన ప్రపంచ శాంతి దూత మదర్ థెరిస్సా

## చార్వాక యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్



**గుంటూరు , ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** కుల, మత ప్రాంతాల కతీతంగా మానవత్వాన్ని పరిమళించే విధంగా మానవత దృక్పథంతో సమాజంలో ఆపదలో విపత్కర పరిస్థితుల్లో అట్టడుగున సమాజానికి దూరంగా బ్రతుకుతున్నా అనేక మందిని చేరదీసి ఆశ్రయం కల్పించి, అనాథలకు అండగా నిలిచి ప్రపం చంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో ప్రపంచ శాంతి దూతగా పేరు పొందిన మదర్ థెరిస్సా చిరస్మరణీయురాలని చారువాక యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నం డేవిడ్ విలియమ్స్ పేర్కొన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా సోమవారం గుంటూరు లక్ష్మీపురంలోని మధర్ థెరిస్సా విగ్రహానికి చార్వాక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాసిడోనియా ప్రాంతంలో సోపే ఊరిలో ఆగస్టు 26 న జన్మించి ఆగ్నేష్ 12 వ ఏట క్రిస్టియానిటి తెలుసుకొని క్రీస్తు యొక్క బోధన అనుసారం క్రీస్తు ప్రేమను క్రియల్లో చూపించాలనే ఉద్దేశంతో తన పొరుగువారి పట్ల ప్రేమ, జాలి, కరుణ కలిగి ఉండాలనే క్రీస్తు బోధనలకు ఆకర్షితురాలై క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ క్రీస్తు యొక్క వాక్యాలను క్రియలలో చూపిస్తూ సమాజంలో అనేకమందికి అండగా నిలిచారని అటువంటి మహోన్నత వ్యక్తి అందరికీ ఆదర్శనీయురాలని అన్నారు. తన 18 వ సంవత్సరం నుండి మదర్ థెరిస్సా సన్యాసిగా మారి పూర్తిగా కుష్టు వ్యాధి అనాధలకు సేవ చేస్తూ జీవించింది తన జీవితకాల యావత్తు పేద ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసింది.

సేవ చేస్తున్న రోజుల్లో 1979 లో నోబుల్ శాంతి బహుమతి, 1980లో భారతరత్న. 2016 లో సెప్టెంబర్ 4న సెయింట్ హోదా లభించింది ప్రేమే ధర్మం సేవే మార్గంగా 375 సంవత్స రాల తర్వాత 640 మంది లో మదర్ థెరిస్సా కి సెయింట్ హో దా లభించింది అన్నారు. అటువంటి సేవ మూర్తి, సమాజ సేవకురాలు, మానవత మూర్తి జయంతి సందర్భంగా ఆమె యొక్క సేవలను జ్ఞాపకం చేసుకుంటూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన మానవతా మూర్తి ఆమెకు ఘన నీలి జై భీములు తెలియజేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమం లో దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు. నాముతోటి శంకర్, అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు. జజ్జరి మనోజ్ తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న కాగిత



**గూడూరు,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** గూడూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకృష్ణ ఆలయం నందు కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ .ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ని శాలువాతో మరి పూలమాలాలతో సత్కరించిన ఆలయ బృందం.ఈ కార్యక్రమంలో పోతన స్వామి, అన్నంహరి రామకృష్ణ, పోతుల రాము, కాట్రేడ్డి నాగ మురళి,బచ్చుల శ్రీనివాసరావు,డొక్కు నాగరాజు, గొరిపత్తి ఫణి రాజు,గొరిపర్తి రాజబాబు, జొన్నలగడ్డ రమేష్, మెరుగు మాల రాము కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టవారిపాలెం జంక్షన్‌లో రోడ్డు ప్రమాదం



**సంతమాగులూరు,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** మండల పరిధిలోని పుట్ట వారి పాలెం అడ్డరోడ్డు జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. ఒంగోలు నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ పుట్ట వారి పాలెం జంక్షన్ వద్ద చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాదారుడికి స్వల్ప గాయాలు కాగా ద్విచక్ర వాహనం ధ్వంశమైంది. కాగా అతని వెంటనే ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకొని ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# అనేక రికార్డులు తారుమారు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. రెవెన్యూశాఖలో ఆన్‌లైన్ ట్యాంపరింగ్, రికార్డుల తారుమారుపై గ్రామస్థాయిలో బాధితుల నుంచి అధికారులు ఫిర్యాదులు తీసుకొని పరిష్కరిస్తారని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో రెవెన్యూ పరంగా ప్రజలు అనేక సమస్యల్ని ఎదుర్కొన్నారని అన్నారు. ఈ సభల్లో గ్రామస్థాయి అధికారుల నుంచి కలెక్టర్ వరకు పాల్గొంటారని చెప్పారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన మంత్రి.. అక్కడికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి సమస్యను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు.

# టీడీఆర్ బాండ్ల అక్రమాలు..

(మొదటిపేజీ తరువాయి)

రూ.వేల కోట్లు పక్కదారి పట్టాయన్నారు. కమిటీ నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. "జగన్ పాలనలో అవినీతిని కొత్తపుంతలు తొక్కించారు. నగరపాలక సంస్థల్లో ఉద్యోగులను నియమించి వ్యక్తిగత అవసరాలకు వినియోగించారు. మున్సిపల్ శాఖలోని సమస్యలను 6 నెలల్లో పరిష్కరిస్తాం"అని నారాయణ తెలిపారు.

# ఎపిని గాడిలో పెడతాం

(మొదటిపేజీ తరువాయి)

అని మంత్రి అచ్చెం నాయుడు తెలిపారు. ఏ మంత్రి, ఏ శాఖను రివ్యూ చేసిన ఎక్కడా అప్పులు తప్ప ఆదాయం కనిపించడంలేదు.కానీ ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఇబ్బందులు ఉన్న ఒకొక్క హామీని నెరవేరుస్తాం. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా పెంచిన పింఛన్లు అందించాం.రాష్ట్రంలో మరో 100 అన్న క్యాంటీన్లు ప్రారం భానికి అంచనా వేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో శ్రేయోభిలాషులు, ఎన్ఆర్ఐ సోదరులు ఇచ్చిన డబ్బులతో అన్న క్యాంటీన్ నడిపాం. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకుంటున్నాను. ఛాలెంజింగ్‌గా ఉన్న కార్యక్రమాలు చిత్తశుద్ధితో నిర్వహిస్తాను. ప్రజలు మెచ్చే నాయకుడిగా నేను పనిచేసి చూపిస్తాను. అధికారులు బదిలీలు పారద ర్శకంగా జరుగుతాయి. అటెండర్ నుండి ఉన్నతాధికారి వరకు బదిలీలు కోసం ఒక్క పైసా ఇచ్చినా తీసుకున్న చర్యలు తీసుకుంటాము. బదిలీల కోసం పైరవీలుకు ప్రోత్సహించవద్దు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు గౌరవాన్ని పెంచే విధంగా పనిచేస్తాను. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంశంపై త్వరలో నిర్ణయం తీసు కోనున్నట్లు మంత్రి అచ్చెం నాయుడు తెలిపారు.

# పాకిస్థాన్‌లో దారుణం

**లాహోర్,ఆగస్టు 26 :** పాకిస్థాన్‌లో దారుణం చోటుచేసుకుంది. కొందరు సాయుధులు రహదారిని అడ్డగించి, వాహనాల నుంచి ప్రయాణికుల్ని కిందికి దింపేసి కాల్పులు జరిపారు. బలూచిస్థాన్ లోని ముసాఖెల్ జిల్లాలో సోమవారం జరిగిన ఘట నలో 23 మంది ప్రాణాలు కోల్పోయారని డాన్ మీడియా సంస్థ వెల్లడించింది ముసాఖెల్ జిల్లాలోని రరాషమ్‌లోని రహ దారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. కొందరు సాయుధులు దారిని అడ్డగించి, అటుగా వస్తోన్న బస్సులు, ట్రక్కుల్లో నుంచి ప్రయాణికుల్ని దింపి, వారి గుర్తింపు తనిఖీ చేశారు. తర్వాత వారిపై కాల్పులు జరపడంతో 23 మంది మృతి చెందారు. అంతేగాకుండా వాహనాలకు నిప్పుపెట్టారు. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ప్రయాణికులే లక్ష్యంగా ఈ దాడి జరి గినట్లు మీడియా పేర్కొంది. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్టీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలోనూ ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. గతేడాది అక్టోబర్‌లో పంజాబ్‌కు చెందిన ఆరుగురు కూలీలను గుర్తుతెలియని సాయుధులు కాల్చి చంపారు. బలూచిస్థాన్‌లోని కెచ్ జిల్లాలో ఆ దారుణం చోటుచేసుకుంది. అవి లక్షిత హత్యలని అప్పట్లో పోలీసులు పేర్కొన్నారు. 2015లో జరిగిన ఘటనలో 20 మంది నిర్మాణ రంగ కార్మికులు కన్నుమూశారు.

# లద్దాఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతంలో కొత్తగా ఐదు జిల్లాలు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. ఎక్స్ వేదికగా ప్రకటించారు. దీనికి సంబంధించిన కార్యచరణ త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా.. 'సుసంపన్నమైన, అభివృద్ధి చెందిన లద్దాఖ్‌ను నిర్మించేందుకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్ణయించింది. షామ్, నుబ్రా, జన్‌స్కర్, ద్రాస్, చాంగ్‌థాంగ్ అనే ఐదు జిల్లాలను త్వరలో ఏర్పాటు చేయనున్నాం. దీని ద్వారా పాలన మరింత పటిష్టం అవుతుంది. ఇకపై ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు మెరుగ్గా అందుతాయి. లద్దాఖ్ ప్రజలకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని రాసుకొచ్చారు. 2019లో అప్పటి ఎన్డీయే ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఒకటి జమ్మూకశ్మీర్ అయితే మరొకటి లద్దాఖ్. అప్పట్నుంచి లద్దాఖ్ ప్రాంతంలో లేహ్, కార్గిల్ అనే రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రాంతం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటుంది. తాజా నిర్ణయంతో జిల్లాల సంఖ్య ఏడుకు పెరగనున్నాయి.

# యూపిఐ తరహాలో యూఎల్ఐ సేవలు

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో కొత్తతరహా సేవలకు నాంది పలకనుంది. రుణాలు తీసుకోవడాన్ని సులభతరం చేయడం కోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ ను జాతీయస్థాయిలో త్వరలో లాంచ్ చేయనుంది. గతేడాదే 'ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్' పేరిట పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన ఆర్‌బీఐ.. అవి సత్ఫలితాలు ఇవ్వడంతో త్వరలో దేశవ్యాప్తంగా సేవలు అందించేందుకు సిద్ధమైంది. డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో యూపీఐ ఏవిధమైన పాత్ర పోషిస్తోందో.. రుణ వితరణలో యూఎల్ఐ కూడా అదే పాత్ర పోషించబోతోంది. దేశ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జర్నీలో యూఎల్ఐ కీలక భూమిక నిర్వహించబోతోందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. బెంగళూరులో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన దీనిపై మాట్లాడారు. భూ రికార్డులు మొదలుకొని, ఇతర ముఖ్యమైన డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా యూఎల్ఐ పనిచేస్తుందని చెప్పారు. దీనివల్ల రుణ ఆమోద పక్రియ సరళతరం కానుందని తెలిపారు. రుణం పొందేందుకు డాక్యుమెంటేషన్ పక్రియ అవసరం ఉండదని శక్తికాంతదాస్ వివరించారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాల జారీ వేగవంతం కానుందని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 17న ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ పేరిట పైలట్ ప్రాజెక్టును లాంచ్ చేశారు. ఆర్‌బీఐకి చెందిన రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ ద్వారా దీన్ని చేపట్టారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు సెకన్లలో జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే భార తదేశంలో రిటైల్ డిజిటల్ చెల్లింపు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే వచ్చిన యూపిఐ చెల్లింపు వ్యవస్థ విజయవంతమైంది.

# ప్రపంచంలో పెద్ద పార్టీగా బిజెపి..!

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ పురందరేశ్వరి అన్నారు. బీజేపీ తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్న విషయం తెలిసిందే. రాజమండ్రి బీజేపీ కార్యాలయంలో ఎంపీ పురందరేశ్వరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరి గింది. ఈ కార్యక్రమానికి అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, సోము వీర్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పురందరేశ్వరి మాట్లాడుతూ.. 2014లో నిర్వహించిన సభ్యత్వ నమోదు ఆన్‌లైన్‌లో మొదటిసారిగా ప్రవేశపెట్టామన్నారు. భారతీయ జనతా పార్టీ సిద్దాంతాలు, బీజేపీ దేశానికి సేవ చేసే అంశాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా అప్పట్లో ప్రజల వద్దకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. చైనాకు సంబం ధించిన కమ్యూనిస్టు పార్టీ ప్రపంచంలోనే తొమ్మిది కోట్ల మంది సభ్యులతో అతిపెద్ద పార్టీగా అవతరించిందని పురందేశ్వరి పేర్కొన్నారు. 2014లో భారతీయ జనతా పార్టీ 11 కోట్ల మంది కొత్త సభ్యులు నమోదు చేసి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందని పురందేశ్వరి తెలిపారు. ఎలాంటి అవినీతి మరకలేకుండా ప్రజాహితంగా తమ పార్టీ పని చేస్తోందన్నారు. భారత దేశంలో ఈ రోజుకి సభ్యుల సంఖ్య 18 కోట్ల వరకూ ఉందని పురందేశ్వరి తెలిపారు. 1980 వ సంవత్సరంలో ఇద్దరు పార్లమెంట్ సభ్యులతో మొదలైన బీజేపీ ప్రస్థానం, నేడు 240 మంది పార్లమెంట్ సభ్యులను గెలిపించుకునే స్థాయికి వెళ్లిందని పురందేశ్వరి పేర్కొన్నారు. ఇండియా ప్రతిపక్ష కూటమి దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిందని తెలిపారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి తీసుకొస్తే సంపూర్ణంగా రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని దుష్ప్రచారం చేశారని పురందేశ్వరి పేర్కొన్నారు. చర్చిల్ని, మసీదుల్ని కూల్చేస్తారని రిజర్వేషన్లు తీసివేస్తారని కావాలని దుష్ప్రచారం చేశారన్నారు. అందువల్లనే ఎన్నికల్లో సీట్లు తగ్గాయన్నారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తే లేదని పురందేశ్వరి స్పష్టం చేశారు. రాజ్యాంగానికి కట్టుబడి పని చేసే పార్టీ భారతీయ జనతా పార్టీ అని పేర్కొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఇసుక వివరాలు

(మొదటిపేజీ తరువాయి)

స్టాక్‌యార్డుల ద్వారా వియోగదారులకు ఇసుక సరఫరా అవుతుండగా, జూలై 8 నుండి సోమవారం వరకు 21,47,883 మెట్రిక్ టన్నుల ఇసుక కొనుగోలు దారులకు చేరిందన్నారు. సీఎం సూచనల మేరకు బుకింగ్ కేంద్రాలను ప్రాత్యేకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. 26వ తేదీన 22,114 మెట్రిక్ టన్నుల మేర 1,748 బుకింగ్‌లు జరిగాయన్నారు. 1609 ఆర్డర్లకు గానూ 20,552 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. రాష్ట్రంలో ఇసుక ముగింపు నిల్వ 16,63,263 ఎంటి గా ఉందన్నారు. 139 ఆర్డర్‌లకు సంబంధించి 1,562 ఎంటి ఇసుక డెలివరీ పెండింగ్‌లో ఉందని, అది కూడా పొద్దుపోయే సమయానికి పూర్తి అవుతుందని మీనా పేర్కొన్నారు.

# కుప్పకూలిన శివాజీ విగ్రహం



**ముంబై,ఆగస్టు 26 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది అట్టహాసంగా ఆవిష్కరించిన ఛత్రపతి శివాజీ మహరాజ్ 35 అడుగుల ఎత్తయిన విగ్రహం సోమవారంనాడు కుప్పకూలింది. మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లా రాజ్‌కోట్ ఫోర్ట్‌లోని ఈ విగ్రహం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కూలిపోయినట్టు అధికారులు తెలిపారు. విగ్రహం కూలిపోవడానికి కారణం తెలియలేదు. అయితే, గత రెండు మూడు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు ఇందుకు కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. సీనియర్ అధికారులు, జిల్లా యంత్రాంగం హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకోగా, విగ్రహం కూలిపోవడానికి కారణాలు, ఏ మేరకు నష్టం జరిగిందనే దానిపై నిపుణుల అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది డిసెంబర్ 4న 'నేవీ డే' సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాజ్‌కోట్ ఫోర్ట్‌లో జరిగిన వేడుకల్లో సైతం పాల్గొన్నారు. శివాజీ మహరాజ్ 35 అడుగుల విగ్రహం కుప్పకూలడానికి ప్రభుత్వానిదే బాధ్యత అని ఎన్‌సీపీ (ఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి జయత్ పటేల్ ఆరోపించారు. ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని, కేవలం ప్రధానమంత్రితో విగ్రహావిష్కరణ చేయించడం పైనే దృష్టి పెట్టిందని విమర్శించారు. కొత్త టెండర్లు పిలవడం, కమిషన్లు తీసుకుని కాంట్రాక్టులు ఇవ్వడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. కాగా, విగ్రహ నిర్మాణంలో నాసిరకం ప్రమాణాలు పాటించినట్టు శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే వైభవ్ నాయక్ ఆరోపించారు. బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, విగ్రహ నిర్మాణం, ఏర్పాటు చేసిన వ్యక్తులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

# కంగనా రనౌత్‌కు బిజెపి షాక్

**న్యూఢిల్లీ,ఆగస్టు 26 :** బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కు పార్టీ హైకమాండ్ షాకిచ్చింది. రైతు నిరసనల విషయంలో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోకుంటే మన దేశంలో కూడా బంగ్లాదేశ్ లాంటి సంక్షోభం ఏర్పడవచ్చుంటూ ఆమె చేసిన వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బీజేపీ ప్రకటించింది. కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలకు పార్టీ బాధ్యత వహించబోదని స్పష్టం చేసింది. పార్టీ తరపున విధానపరమైన అంశాలపై మాట్లాడే అధికారం కంగనా రనౌత్‌కు లేదని, అందుకు ఆమెకు అనుమతి ఇవ్వలేదని తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటనలో బీజేపీ క్లారిటీ ఇచ్చింది. కంగనాను సున్నితంగా మందలించిన అధిష్ఠానం వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించింది. సమ్మిళిత అభివృద్ధికి కంగనా కట్టుబడి ఉండాలని సూచించింది. సామాజిక సామరస్య విధానాల విషయంలో పార్టీ నిబద్ధతతో ఉందని పునరుద్ఘాటించింది. కాగా రైతుల ఉద్యమంపై కంగనా రనౌత్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతుల ఉద్యమంలో విదేశాల కుట్ర ఉందని అన్నారు. రైతు నిరసలను అదుపు చేయకపోతే బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు వస్తాయని అన్నారు.

ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో బీజేపీ అధిష్టానం ఈ దిద్దుబాటు చర్యలకు దిగింది. కాగా కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇదే తొలిసారి కాదు. 2020లో రైతుల నిరసనల సమయంలో పంజాబ్‌కు చెందిన ఒక మహిళా రైతును 'బిల్కిస్ బానో'గా అభివర్ణించింది. అంతకుముందు ఢిల్లీలోని షాహీన్ బాగ్‌లో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న ఒక వృద్ధురాలిని ఉద్దేశిస్తూ... ఆ మహిళ రూ.100కు అందుబాటులో ఉంటుందని, నిరసనల కోసం ఆమెను తీసుకెళ్లవచ్చునని పేర్కొన్నారు.

# 25 మంది మావోల లొంగుబాటు



**బీజాపూర్,ఆగస్టు 26 :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 25 మంది మావోయిస్టులు లొంగిపోయి నట్లు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు సోమవారం తెలిపారు. వీరిలో ఐదుగురు మావోయిస్టులపై మొత్తం రూ. 28 లక్షల రివార్డు ఉందని అన్నారు. గంగ్లూర్, భైరామ్‌గఢ్ ప్రాంతాల్లో వీరు యాక్టివ్‌గా ఉండేవారని, వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నట్లు తెలిపారు. శంబటి మడ్కం (23), జ్యోతి పునెం (27) ఇద్దరు మహిళలతో పాటు మహేష్ తేలంలు మావోయిస్టు కంపెనీ నెం.2లో యాక్టివ్‌గా ఉండేవారని.. వీరి ఒక్కొక్కరిపై రూ. 8 లక్షల రివార్డు ఉందని అన్నారు. విష్ణు కార్తమ్ అలియాస్ మోనూ (29), జయదేవ్ పొడియమ్ (18)ల ఒక్కొక్కరిపై రూ. 3 లక్షలు, లక్ష రూపాయల రివార్డు ఉన్నట్లు తెలిపారు. గుడ్డు కకేమ్ (20), సుద్రు పూణెం (32)లపై చెరో రూ. 10,000 చొప్పున రివార్డు ఉందని అన్నారు. శంబటి మడ్కం 2012 నుండి మావోయిస్టు ఉద్యమంలో చురుగ్గా ఉన్నారని, 2020లో 17 మంది భద్రతా బలగాలు ప్రాణాలు కోల్పోయిన సుక్మాలోని మిన్పా మెరుపుదాడిలో కీలక పాత్ర పోషించారు. 2021లో బీజాపూర్‌లోని తెకలగూడెంలో 22 మంది భద్రతా బలగాలు మరణించిన దాడిలోనూ ఆమె పాత్ర ఉన్నట్లు బీజాపూర్ సూపరింటెండెంట్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు ఒక్కొక్కరికి రూ. 25,000 సాయం, ప్రభుత్వ పాలసీ ప్రకారం పునరావాస సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. వీరితో కలిపి మొత్తం 170 మంది మావోయిస్టులు హింసకు దూరమయ్యాయని, మరో 306 మందిని అరెస్ట్ చేశామని ఎస్‌పి తెలిపారు.

# వైద్యురాలి హత్యాచారం

**కోల్‌కతా,ఆగస్టు 26 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో ఉండగా అక్కడే ఈ లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఇందులో నిందితుడు ఏం చెప్పారన్న వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే, పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు అసత్యం, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న ఈ దారుణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సివిక్ వాలంటీర్ అయిన సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ అనాలోచితంగా, ఆత్రుతగా ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అధికా రులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ఆధారాలు చూపిం చి నప్పుడు.. ఆ సమయంలో తాను అక్కడ లేనని నిందితుడు చెప్పాడట. అంతేగాక, తాను సెమినార్ హాల్‌కు వెళ్లేసరికి వైద్యురాలు అప్పటికే చనిపోయి ఉందని, భయంతో తాను అక్కడి నుంచి పారిపోయానని సంజయ్ చెప్పినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించే సమయంలో అతడి తరఫు డిఫెన్స్ లాయర్ లేకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామన్నది అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఇది మానవహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపించారు. కాగా.. వైద్యురాలిపై అఘా యిత్యానికి పాల్పడింది తానేనంటూ అంతకు ముందు కోల్‌కతా పోలీసుల ఎదుట నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి చెందిన వైద్యబృందం నిందితుడి మానసిక తీరును విశ్లేషించింది. ఘటన సమయంలో ప్రతీ నిమిషం చోటుచేసుకున్న విషయాలను నిందితుడు గుక్కతిప్పకుండా మొత్తం ఎపిసో డ్‌ను వివరించాడని, అతడిలో పశ్చాత్తాపమే లేనట్లు కన్పించిందని కేసు దర్యాప్తులో పాల్గొన్న ఓ సీబీఐ అధికారి చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే, ఆ తర్వాత అతడిని కోర్టులో హాజరుపర్చగా.. సంచలన ఆరోపణలు చేశాడు. కావాలనే తనను ఇందులో ఇరికించారని న్యాయస్థానంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

# సెజ్ బాధితులను ఆదుకున్నాం

(మొదటిపేజీ తరువాయి)

హోంమంత్రి అనిత తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తున్నట్లు చెప్పారు. అచ్యుతాపురం సెజ్, పర వాడ సినర్జిన్ కంపెనీ.. ఈ రెండు ప్రమాదాల్లోనూ బాధితులను ఆదుకున్నది కూటమి ప్రభుత్వమేనన్నారు. కార్మికుల కుటుంబాలను అడ్డం పెట్టుకొని వైకాపా నేతలు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రమాదం జరిగిన కొన్ని గంటల్లోనే సీఎం చంద్రబాబు విశాఖ వచ్చి బాధితులకు భరోసా కల్పించారని గుర్తు చేశారు. రెండు ఘటనలపై హోంమంత్రిగా తాను ఇక్కడే ఉండి పర్యవేక్షించానని అనిత చెప్పారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదంలో చనిపోయిన ముగ్గురు కార్మికులకు ఒక్కక్కరికి కోటి రూపాయలు పరిహారం అందచేస్తా మన్నారు. విశాఖ రెండు ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకున్నది కూటమి ప్రభుత్వమే అని చెప్పుకొచ్చారు. వైసీపీ నేతలు కార్మికుల కుటుంబాలను అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే సీఎం చంద్రబాబు విశాఖ వచ్చి బాధితులను పరామర్శించి ధైర్యం, భరోసా కల్పించారన్నారు. విశాఖ జిల్లాలో జరిగిన రెండు ఘటనలపై హోంమంత్రిగా తాను ఇక్కడే ఉండి పర్యవేక్షించినట్లు అనిత వెల్లడించారు. కాగా... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎసె న్షియ ఫార్మాలో ప్రమాద మృతులకు ఎలాగైతే పరిహారం చెల్లించారో.. అలాగే పంవాడ సెనర్జిస్ మృతులకు కూడా పరిహారం చెల్లించాలని యాజమాన్యంతో హోంమంత్రి అనిత మాట్లాడారు. ఈ క్రమంలో పరవాడ సెనర్జిస్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుం బాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించేందుకు అంగీకారం తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో చెక్కులను మృతుల కుటుం బాలకు సెనర్జిస్ యాజమాన్యం అందజేసింది.

# విద్యార్థుల వల్లనే తెలంగాణ పోరాటం..

(మొదటిపేజీ తరువాయి)

నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 90 రోజుల్లో 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశా మని, మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నామని ఆయన ప్రకటించారు. సరైన సమయం లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్రూప్-1, 2, 3 కావచ్చు..ఇతర ఉద్యోగాలు కావచ్చు.. ఖాళీలను బర్తీ చేసేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ఇక విద్యార్థులు, కంపెనీల మధ్య గ్యాప్ వస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు తాము నియామకాలు చేపడితే వాయిదా వేయాలని అంటున్నారని విపక్ష బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. వాళ్ల ఉద్యోగాలు పోయాకే నిరుద్యో గులు గుర్తుకొచ్చారని ఎద్దేవా చేశారు. విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలని చూశారని మండిపడ్డారు. 90 రోజుల్లో 30 వేల మందికి నియామక పత్రాలు అందించామని ప్రస్తావించారు. దుక్కల్లాగా ఉన్న బావ, బామర్దులు నిరుద్యోగ యువత కోసం అమరణ నిరాహారదీక్ష చేయాలని రేవంత్ విమర్శిం చారు. మా ప్రభుత్వం కష్టపడి చదువుతున్న విద్యార్థుల కోసం పని చేస్తోంది. పదేళ్లలో అధికారం కోసం పని చేసి ఇవాళ వాళ్లు రాజకీయ నిరుద్యోగులు గా మిగిలిపోయారు. మా కోసం మేము పని చేయము. మా కర్తవ్యం తెలంగాణ సమాజం కోసం కష్టపడి చేయడం అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సెక్రటరీయేట్‌లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఈ సాయాన్ని అందజేశారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన 135 మందికి రూ.1 లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ సాయంతో ఈపథకం కింద సాయం అందించారు. గత ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటో పదేళ్లు కళ్లారా చూశామని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్ సర్వెంట్లు కావాలని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్టను పెంచాలని, మెయిన్స్‌లో ఉత్తీర్ణులైతే మళ్లీ ఆర్థికసాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. ఇక 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సచివాలయంలోకి ఎవరూ రాకుండా గతంలో పోలీసు పహారా ఉండేదని, గత ప్రభుత్వం నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. నైపుణ్యాలు లేకపోవడంతోనే నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోందని అన్నారు. యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2 వేల మందికి శిక్షణ ఇస్తామని, యంగ్ ఇండియా వర్సిటీలో ఏటా 20వేల మందికి శిక్షణ ఇస్తామని వెల్లడించారు.

# రాహుల్ కీలక వ్యాఖ్యలు

- 20-30 ఏళ్ల నుంచి ఈ ఒత్తిడిని అధిగమించా..
- రాహుల్ గాంధీ ముందు మరోసారి పెళ్లి ప్రస్తావన



**న్యూఢిల్లీ,ఆగస్టు 26 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందు మరోసారి పెళ్లి ప్రస్తావన వచ్చింది. వివాహం ఎప్పుడు చేసుకుంటారని కశ్మీరీ యువతులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ..20, 30 ఏళ్లుగా ఈ ఒత్తిడిని అధిగమించానని చెప్పడం గమనార్హం.ఇటీవల జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన రాహుల్.. శ్రీనగర్‌కు చెందిన పలువురు విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంలో పెళ్లి చేసుకోవడంపై కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తోందా? అని రాహుల్ వారిని ప్రశ్నించారు. అదే సమయంలో మీ పెళ్లి ఎప్పుడు అంటూ రాహుల్‌నే ఎదురు ప్రశ్న వేశారు. దానికి నవ్వుతూ బదులిచ్చిన ఆయన.. '20-30 ఏళ్ల నుంచి ఈ ఒత్తిడిని అధిగమించా' అంటూ సమాధానమిచ్చారు.వివాహం గురించి తదుపరి ప్రణాళికలు ఏంటని రాహుల్‌ని ప్రశ్నించగా.. ప్రస్తుతానికి అటువంటిదేమీ లేదన్నారు. కానీ,.. వాటిని తోసిపుచ్చలేమని చెప్పారు. దాంతో వివాహానికి మమ్మల్ని ఆహ్వానించండి అంటూ అక్కడున్న విద్యార్థినులు కోరగా.. తప్పకుండా పిలుస్తానంటూ రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ రాహుల్ గాంధీ వివాహం గురించి ప్రస్తావన వచ్చింది. సోదరి ప్రియాంకా గాంధీతో కలిసి రాయ్‌బరేలీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయనకు.. పార్టీ అభిమానుల నుంచి ఇదే ప్రశ్న ఎదురైంది.

# మాకు సాయం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

జరిగినట్లు తెలిపారు. ఇప్పటివరకు జరిగిన అతి పెద్ద దాడుల్లో ఇది ఒకటని అన్నారు. కీలకమైన పౌర మౌలిక సదుపాయాలను టార్గెట్ చేస్తూ జరిపిన ఈ దాడుల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉక్రెయిన్‌లోని వోలిన్, ఎల్వివ్, ఇవానో-ఫ్రాన్కివ్స్క్, విన్నిట్సియా, ఖ్మెల్నిట్స్కీ, టెర్నోపిల్ ప్రాంతాలను లక్ష్యాలుగా చేసుకొని బాంబులతో విరుచుకుపడిందని తెలిపారు. రష్యా దాడులతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని, పునరుద్దరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రష్యా చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ మేరకు జెలెన్ స్కీ సోషల్ మీడియాలో ఓ వీడియో విడుదల చేశారు.రష్యా వైమానిక బాంబు దాడులను అడ్డుకునేందుకు సాయం చేయాలని యూరోపియన్ దేశాలను ఆయన కోరారు. రష్యా క్షిపణులు, డ్రోన్‌లను కూల్చేందుకు తమ వైమానిక దళంతో పొరుగున ఉన్న యూరోపియన్ దేశా రక్షణ వ్యవస్థలు కలిసి పనిచేయాలని కోరారు. దీని ద్వారా తమ దేశ పౌరుల ప్రాణాలను రక్షించుకునేందుకు ఎక్కువ ప్రయత్నించగలమని చెప్పారు. ఇది మిడిల్ ఈస్ట్ ఐ కృతను ప్రతిబింబిస్తుందని చెప్పారు.ఇదిలా ఉండగా దాదాపు రెండేళ్లకు క్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగుతోంది. రెండు దేశాలు ఒకరిపై మరొకటి విరుచుకుపడుతున్నాయి. అత్యాధునిక ఆయుధాలతో ఇరు దేశాల సైన్యం పోరాడుతున్నాయి. అటు రష్యా సైన్యాన్ని అడ్డుకోవడానికి ఉక్రెయిన్ బలగాలు తీవ్రంగా ప్రతిఘటిస్తోన్నాయి.ఈ విధ్వంసం కారణంగా ఇప్పటికీ వేలాది మంది పౌరులు, సైనికులురు ప్రాణాలు కోల్పోయారు. అదే స్థాయిలో ఆస్తినష్టం సంభవించింది.

# బిజెపి అభ్యర్థుల తొలి జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి, జేపీ నడ్డా తదితరులు సైతం ఎన్నికల ప్రచారంలో కీలకంగా ఉంటారు. కాగా, స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లను కూడా ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, హిమాచల్ ప్రదేశ్ సీఎం జైరామ్ ఠాకూర్ తొలిదశ ప్రచారంలో పాల్గొంటారు. బీజేపీ మాజీ ప్రధాన కార్య దర్శి, ఇటీవలే జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన రామ్ మాధవ్, జమ్మూకశ్మీర్ పార్టీ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జి తరుణ్ చుగ్, జమ్మూకశ్మీర్ బీజేపీ చీఫ్ రవీందర్ రైనా, ఎంపీ జుగల్ కిషోర్ శర్మ, రాజ్యసభ సభ్యుడు గులాం అలీ ఖతన, ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) అశోక్ కౌల్, జమ్మూకశ్మీర్ బీజేపీ ఉపాధ్యక్షుడు సోఫి యూసుఫ్ సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 90 మంది సభ్యుల జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు విడతలుగా సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది. అక్టోబర్ 4న ఫలితాలు వెలువడతాయి. 2019లో 370వ అధికరణ రద్దు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించిన తరువాత జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవే కావడం విశేషం.

# రాష్ట్రంలో ఘనంగా కృష్ణాష్టమి





**విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**దేశ వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతి సంవత్సరం శ్రావణమాసం కృష్ణ పక్షంలోని ఎనిమిదవ తిథి నాడు రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు దేవకీ మాత అష్టమ గర్భాన జన్మించాడు. కాబట్టి ఆ రోజున శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకుంటారు. ఈ వేడుకల కోసం ఆలయాలన్నీ అందంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీప కాంతుల నడుమ మెరిశాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి అనగానే మనకు గుర్తొచ్చేవి కన్నయ్య జన్మించిన మధుర, బృందావనం. అయితే దక్షిణాదిలోనూ జన్మాష్టమి వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతాయి. కర్ణాటకలోని ఉడిపిలో కన్నయ్య జన్మదిన వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఇక ఇస్కాన్ టెంపుల్ ఎక్కడుంటే అక్కడ జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. విజయవాడలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇస్కాన్ టెంపుల్‌లో కొలువైన రాధా కృష్ణులను దర్శించుకునేందుకు తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. మూడు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఇస్కాన్ టెంపుల్ నిర్వహించింది. ఆగస్టు 25 ,26, 27 తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఆదివారం నుంచే వివిధ కార్యక్రమాలతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. 108 రకాల నైవేద్యాలతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. రాధా కృష్ణులకి 2వేల కిలోలతో పుష్పాభిషేకం నిర్వహించారు. అలాగు ఇస్కాన్ దేవాలయంలో పంచామృతాలతో కలశ అభిషేకాలను సైతం కన్నయ్యకు నిర్వహించారు. జిల్లాస్థాయిలో కళాశాల విద్యార్థులతో ఉట్టి మహోత్సవ కాంపిటేషన్‌ను విజయవాడ ఇస్కాన్ టెంపుల్ నిర్వహించింది.

## ఇస్కాన్ టెంపుల్లో అంగరంగ వైభవంగా వేడుకలు

### 108 పదార్థాలతో నైవేద్యాల సమర్పణ

రాధాకృష్ణ ఉట్టి మహోత్సవ కాంపిటీ షన్‌లో గెలుపొందిన విజేతలకు ఎంపీ.కేశినేని శివనాథ్ చిన్ని చేతుల మీదుగా ఇస్కాన్ యాజమాన్యం బహుమతులు అందించనుంది. కృష్ణాష్టమి సందర్భంగా ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో సాయంత్రం ఉట్టి వేడుకలు జరగనున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విజయవాడలో ఆలయాలలో రద్దీ నెలకొంది. ఇక జన్మాష్టమి రోజున ఉపవాసం ఉండటం వల్ల జీవితంలోని అన్ని కష్టాలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. అలాగే జన్మాష్టమి రోజున కొన్ని పరిహారం చేయడం వల్ల శ్రీకృష్ణుడు, లక్ష్మీదేవి అను గ్రహం లభిస్తుందని విశ్వాసం. కృష్ణాష్టమి రోజు ఉపవాసంతోపాటు పరిహారాలు చేయడం వల్ల అన్ని సమస్యలు తొలగిపోతాయట.





కృష్ణాష్టమి సందర్భంగా చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ హాల్‌లో శ్రీ కళా సుధ తెలుగు అసోసియేషన్ వారి రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్..

# మాగుంట నేడు జరుపు పర్యటనా కార్యక్రమాలు



**ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**08.00 ఉదయం-ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట. 10.00 ఉదయం-మార్కాపురంలో స్థానిక శాసనసభ్యులు, కందుల నారాయణ రెడ్డి కార్యాలయంలో వుండుట. 10.30 ఉదయం-తర్లుపాడు మండలం తుమ్మల చెరువు గ్రామంలో హజరత్ ఖాశిం స్వాములవారి పీర్ల దర్గాలో కందుల నారాయణ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొనుట. 11.30 ఉదయం-మార్కాపురంలో మాధవి గ్రాండ్ ఇన్ కళ్యాణ మంటపంలో ఆంధ్రప్రదేశ్ యునియాన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, ప్రకాశం జిల్లా వారు నిర్వహించు విస్తృత సమావేశంలో పాల్గొనుట. 04.00 సాయంత్రం-ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట.

# మాజీ శాసనసభ్యులు పాలపర్తి డేవిడ్ ఆత్మకు శాంతి చేకూరాలి

### డేవిడ్ రాజు మృతి చెందడం బాధాకరం..

### ప్రకాశం జిల్లా అభివృద్ధికి కృషి చేశారు..

### కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మాగుంట



**ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**మాజీ శాసనసభ్యులు పాలపర్తి డేవిడ్ రాజు అనారోగ్య కారణంగా మృతి చెందడం చాలా బాధాకరం. శాసనసభ్యులుగా సంతనూతలపాడు, యర్రగొండపాలెం ప్రజలకు విశేష సేవలందించి, జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రకాశం జిల్లా అభివృద్ధికి కృషి చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి.



# శ్రీకృష్ణుని దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి
- కృష్ణమందిరాల నిర్మాణానికి రాజకీయాలకు అతీతంగా సహాయసహకారాలు
- రాష్ట్ర గృహ నిర్మాణం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి





**విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):** శ్రీకృష్ణుని దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని కోరుకుంటున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా విజయవాడ, దుర్గాపురం, అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద శ్రీకృష్ణ మందిరంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. శ్రీకృష్ణపరమాత్ముడు దయతో ప్రజలతో పాటు పశు పక్ష్యాదులు ఆనందంగా ఉండాలని.. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడవాలని.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల కృష్ణభక్తులు కృష్ణ మందిరాలు నిర్మించాలని భావిస్తున్నారని.. రాజకీయా లకు అతీతంగా వారికి సహాయసహకారాలు అందించనున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.

# ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



**అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు అని అన్నారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. 'ఆ శ్రీకృష్ణ భగవానుడు మీ కుటుంబాన్ని ఆనందంతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నాను. గీతాసా రంతో జీవిత సారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడిని స్మరించుకోవడం అంటే మన కర్తవ్యాన్ని మనం గుర్తుచేసుకుని ముందుకు సాగడమే. ఏ విషయంలో అయినా మనకు స్ఫూర్తినిచ్చే శ్రీ కృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో మనం విజయం సాధించవచ్చు. కృష్ణాష్టమి సందర్భంగా ఆ నీలమేఘశ్యాముని కృపా, కటాక్షం రాష్ట్రంపై సదా ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.



# మదర్ థెరీసా జయంతి... నివాళులర్పించిన వైఎస్ జగన్

**అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**నేడు శాంతిదూత మదర్ థెరీసా జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి నివాళులు అర్పించారు. పేద ప్రజలు, రోగ పీడితులు, కుష్టువ్యాధి గ్రస్తులూ, అనాథ పిల్లలే తన ఆస్తిగా భావించి వారందరినీ అక్కున చేర్చుకున్న మానవతామూర్తి మదర్ థెరిసా అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నగరంలోని నిర్మల్ హృదయ్ భవన్ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేలా వారికి సహాయ సహకారాలు అందించామనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.నేడు భారతరత్న, నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిసాగారి జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నానని తెలిపారు.

# నిధులు వృధా చేయకండి

### ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేయండి.

### రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ



**తిరుపతి,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**తిరుపతి నగరపాలక సంస్థ, తుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రాదాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, ఎక్కడా నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులకు సూచించారు. తిరుపతి నగరపాలక సంస్థ, తుడాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై తుడా సమావేశం మందిరంలో సోమవారం మంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. ఇక నుండి ముఖ్యమైన మున్సిపాలిటీల్లో ప్రత్యక్షంగా పాల్గొని ఏమి జరుగుతోంది, అభివృద్ధి ఎలా చేయాలనే అంశాలపై సమీక్షించనున్నానని అన్నారు. నిధుల కొరత ఉందని అనుభవం ఉన్న ముఖ్యమంత్రి కేంద్రం నుండి నిధులు తెచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. త్వరలోనే నిధులు వస్తాయని అన్నారు.



# శ్రీవారి ఆలయ మాఢ వీధులను పరిశీలన

### తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేపథ్యంలో ఆలయ మాఢ వీధులను పరిశీలించిన సివిఎస్వో శ్రీధర్

**తిరుమల,ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సోమవారం టిటిడి సివిఎస్వో శ్రీధర్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సివిఎస్వో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వాహనమండపం, భక్తులు గ్యాలరీలలోనికి వచ్చేందుకు మాడ వీధులలో ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, గ్యాలరీలలోని ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాల పార్కింగ్, తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈఈలు సుబ్రహ్మణ్యం, సుధాకర్, డిప్యూటీ ఇఓ ఆశాజ్యోతి, ఆరోగ్య శాఖ అధికారి డా.మధుసూదన్ రావు, విజివోలు సురేంద్ర, రామ్ కుమార్, నంద కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ తుది, మూడవ విడతలో 5707 సీట్లు భర్తీ

### సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు గణేష్ కుమార్

### ఇంకా మిగిలి ఉన్న సీట్లు 23,155



**విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రపత్రిక):**ఇంజనీరింగ్ ప్రవేశాలకు నిర్దేశించిన ఎపిఈఎపిసెట్ 2024 కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగంగా సోమవారం తుది, మూడవ విడత సీట్ల కేటాయింపును పూర్తి చేసినట్లు సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు, ప్రవేశాల కన్వీనర్ గుమ్మల గణేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులు ఆగస్టు 26 నుండి 30వ తేదీ లోపు తమకు నిర్దేశించిన కళాశాలల్లో ఆన్ లైన్ రిపోర్టింగ్‌తో పాటు, వ్యక్తిగతంగా కళాశాలలో నమోదును పూర్తి చేయవలసి ఉందన్నారు. అయితే జులై 19 నుండే తరగతులు ప్రారంభం అయ్యాయని వివరించారు. కన్వీనర్ కోటా కింద 24 విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలల్లో 7047 సీట్లు ఉండగా, 5920 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. 215 ప్రవేటు కళాశాలల్లో 1,24,491 సీట్లు ఉండగా, 1,02, 669 భర్తీ అయ్యాయని, 9 ప్రవేటు విశ్వవిద్యాలయాల్లో 7950 సీట్లు ఉండగా, 7744 సీట్లు భర్తీ చేసామని తెలిపారు. మొత్తంగా 248 కళాశాలల్లో 1,39,488 సీట్లు ఉండగా, 1,16, 333 సీట్లు భర్తీ అయ్యాయని, 23,155 సీట్లు మిగిలి ఉన్నాయని గణేష్ కుమార్ వివరించారు.

Printed and Published by KANCHARLA RAMAIAH behalf of Nageswara Rao Estates Private Limited, Printed at jagati publication Limited. Sakshi Press, Survey No 86/10, Madhurawada village, MCV Limits, Visakhapatnam - 530041, (AP), Published at D.No50-39-5/A, NORTH EXTENSION LAYOUT, NEAR STATE BANK OF HYDERABAD, SEETAMMADHARA, VISAKHAPATNAM-530013 Editor:KANCHARLA RAMAIAH.Excutive editor V.VIJAYALAKSHMI. RNI NO.10721/65 CELL 9849998069, Email:andhrapatrikadaily@gmail.com